



ఈడిగపల్లెలో ప్రారంభించిన సచివాలయానికి వర్గ పోరుతో తాళాలు వేసిన దృశ్యం

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న అంబులెన్స్

సంఘటనా స్థలంలోనే యువకుడు మృతి, మరొకరి పరిస్థితి విషమం


మృతి చెందిన యల్లప్ప, చికిత్స పొందుతున్న యువకుడు

మదనపల్లె టౌన్, మార్చి 6: మదనపల్లె నుంచి తిరుపతికి ఓ రోగిని తీసుకెళ్తున్న ప్రైవేటు అంబులెన్స్ వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ యువకుడు ప్రమాదస్థలి వద్దే మృతి చెందగా మరో యువకుడి పరిస్థితి విషమంగా మారింది. బుధవారం రాత్రి మదనపల్లెకు చెందిన ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి రోగిని తిరుపతికి రెఫర్ చేయగా ప్రైవేటు అంబులెన్స్‌లో (సుమో) రోగిని తిరుపతికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని ఆరోగ్యవరం వద్ద అంబులెన్స్ ఎదురుగా వస్తున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో యల్లప్ప అనే యువకుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా అతడి పరిస్థితి విషమంగా మారింది. సంఘటన స్థలానికి చేరుకున్న మదనపల్లె తాలూకా పోలీసులు మృతుడితో పాటు, తీవ్రంగా గాయపడిన యువకుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

రాజధాని తరలింపు వైసీపీకి మరణశాసనం

వేంపల్లె, మార్చి 6: రాష్ట్ర రాజధానిని అమరావతి నుంచి విశాఖపట్టణానికి తరలించాలని ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న ప్రయత్నం వైసీపీకి మరణశాసనం అవుతుందని, ఇది ఒక చారిత్రక తప్పిదమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిని రాష్ట్రం నడిబొడ్డులోనున్న అమరావతి నుంచి విశాఖపట్టణానికి తరలించాలన్న జగన్ నిర్ణయాన్ని ఏ ప్రాంతం వాళ్లు కూడా హర్షించడం లేదన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కును రైతులకు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ తదితరులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 6: రైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. 2023 ఖరీఫ్‌లో వర్షాభావం (కరువు), డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో సంభవించిన అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతన్నల ఖాతాల్లో బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ వర్చువల్‌గా బటన్ నొక్కి ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేశారు. కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియా ఖానం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ పంజం సుకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 19,516.21 హెక్టార్లకు గానూ 34,889 మంది రైతుల ఖాతాల్లో రూ.35.57 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023 ఖరీఫ్‌లో వర్షాభావం (కరువు) వల్ల 15946.36 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 29,026 మంది రైతన్నలకు రూ.26.37 కోట్లు, డిసెంబరులో తుఫాను వల్ల 3569.84 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు నష్టపోయిన 5863 మంది రైతులకు రూ.9.20 కోట్ల నష్టపరిహారాన్ని ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెగా చెక్కును రైతులకు అందజేశారు. రాయచోటిలో 10,572 మంది రైతులకు రూ.10.03 కోట్లు, పీలేరులో 4404 మంది రైతులకు రూ.4.16 కోట్లు, రాజంపేటలో 2169 మంది రైతులకు రూ.3.48 కోట్లు, రైల్వేకోడూరులో 4447 మంది రైతులకు రూ.6.43 కోట్లు, తంబళ్లపల్లెలో 12,339 మంది రైతులకు రూ.11.07 కోట్లు, మదనపల్లెలో 958 మంది రైతులకు రూ.40 లక్షలు విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్, ఏడీఏ సువర్ణలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, అనుబంధశాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పల్లె వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లోనే వైద్యసేవలు అందచేస్తామని, అందుకోసం ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మిస్తామన్న ప్రభుత్వ మాటలు చేతల్లో అమలు కాలేదు. చాలా గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు పునాదుల దశలోనే ఉండగా మరి కొన్ని చోట్ల పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో పేదలకు వైద్యం అందనంత దూరంలోనే ఉంది. ఇక సచివాలయాల పరిస్థితి కూడా అలాగే ఉంది. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఈడిగపల్లెలో భవనాలు పూర్తయినా వైసీపీలోని ఒక వర్గం వారు ప్రారంభించగా మరో వర్గం వారు వాటికి తాళాలు వేశారు. దీంతో అవి అందుబాటులోకి రాకపోవడంతో అద్దె భవనంలోనే సచివాలయాన్ని కొనసాగిస్తున్నారు.


తిమ్మసముద్రంలో పునాదులకే పరిమితమైన విలేజ్ హెల్త్ క్లీనిక్

- అసంపూర్తిగా గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు
- అర్ధాంతరంగా ఆగిన నూతన విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లు
- సచివాలయాలదీ అదే పరిస్థితి
- వైసీపీలో వర్గపోరుతో పూర్తయిన భవనాలకు తాళాలు

సుండుపల్లె, మార్చి 6: గ్రామీణ ప్రాంతాల్లో చక్కటి వైద్యం అందిస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు మరోలా ఉన్నాయి. పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను (విలేజ్ హెల్త్ క్లీనిక్) ఏర్పాటు చేస్తున్నామని చెప్పినా చాలా గ్రామాల్లో అవి అందుబాటులో లేని స్థితి నెలకొంది. ఆరోగ్య, పంచాయతీరాజ్‌శాఖలు సంయుక్తంగా వాటికి భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టినా చాలాచోట్ల ఇవి అసంపూర్తిగా ఉండగా కొన్నిచోట్ల పునాదులకే పరిమితమయ్యాయి. తిమ్మసముద్రం, సొంఠంవారిపల్లెలో పునాదుల దశలోనే విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ఆగిపోయాయి. 20 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. భాగంపల్లె గ్రామ పంచాయతీలో విలేజ్ హెల్త్ క్లీనిక్ గోడల వరకు పనులు పూర్తయ్యాయి. సుండుపల్లె-1, 2లలో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. మండల వ్యాప్తంగా 7 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మించేందుకు ప్రభుత్వ నుంచి అనుమతులు వచ్చాయి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలతో పాటు విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మించేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నా నిర్మాణాలు మాత్రం జరగలేదని విమర్శలు వస్తున్నాయి. సుండుపల్లె మండలంలో చాలా గ్రామ పంచాయతీల్లో సచివాలయాల నిర్మాణాలకే గతి లేదు. విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ఏం నిర్మిస్తారని ప్రజలు, పలు పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. సకాలంలో భవన నిర్మాణాలు పూర్తయి ఉంటే సిబ్బంది హెల్త్ క్లీనిక్‌లో ఉండి వైద్యం అందించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో వైద్య సేవల పర్యవేక్షణలోనూ పై అధికారులు అలసత్వం వహిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం రాజకీయ కారణాల రీత్యా భవన నిర్మాణాలు పునాదులకే పరిమితమయ్యాయి.

నిర్మాణమే కాదు.. ప్రారంభంలోనూ జాప్యమేనా...?

మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు అర్ధాంతరంగా ఆగిపోయి ఉన్నాయి. ఒకటి, రెండు నిర్మించినా వాటిని కూడా ప్రారంభించకపోవడం హాస్యాస్పదంగా ఉందని గ్రామ పంచాయతీల ప్రజలు చర్చించుకుంటున్నారు. సుండుపల్లె-2, ఈడిగపల్లె గ్రామ పంచాయతీల్లో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ఏడాది క్రితం నిర్మించారు. ఒక్క విలేజ్ హెల్త్ క్లీనిక్‌కు రూ.17 లక్షలు ప్రభుత్వ డబ్బులతో నిర్మించారు. కానీ ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. వైద్య సేవలు అందించేందుకు వసతి లేక వైద్య సిబ్బంది సచివాలయంలో ఉండి సేవలు అందిస్తున్నారు. ఈడిగపల్లె సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించడం లేదు. సచివాలయాన్ని చిన్న అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఆ భవనంలోనే ఒక కుర్చీ వేసుకుని వైద్య సిబ్బంది సేవలందించాల్సి వస్తోంది. ప్రారంభించకపోవడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గపోరే కారణమని స్థానికులు మాట్లాడుకుంటున్నారు.



ఈడిగపల్లెలో ప్రారంభానికి నోచుకోని విలేజ్ హెల్త్ క్లీనిక్

కొన్ని రోజుల క్రితం సచివాలయాన్ని, రైతుభరోసా కేంద్రాన్ని ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్ ఆకేపాటి వర్గీయులు టెంకాయలు కొట్టి ప్రారంభించారు. అయితే ప్రారంభించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు వైసీపీలోని మరో వర్గీయులు తాళాలు వేయించినట్లు విమర్శలు వస్తున్నాయి. కేవలం పూర్తయిన ప్రభుత్వ భవనాలు ప్రారంభిస్తేనే తాళాలు వేయించారంటే మండలంలో వైసీపీలో వర్గపోరు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. పార్టీలో సఖ్యత లేకపోతే ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేయించడం ఏమిటని ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. వీలైనంత త్వరగా నూతన భవన నిర్మాణాల నుంచి సేవలందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఇరుకు గదుల్లో ప్రజాసేవలకు అంతరాయం

పక్కా భవనాలు నిర్మించకపోవడం వలన అద్దె భవనాల్లో విధులు నిర్వహించాల్సి వస్తోందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. చిన్న భవనంలో 11 మంది సచివాలయ ఉద్యోగులు, సంబంధిత రికార్డులు, ఫర్నీచర్ పెట్టుకుని ప్రజలకు సేవలందిస్తు న్నామని, నిర్మాణాలు పూర్తయిన భవనాలు కూడా ప్రారంభించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. పలు సచివాలయాల్లో మరుగుదొడ్లు లేవని, దీంతో మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో సచివాలయ ఉద్యోగులు సేవలు అందిస్తున్నారని, మా సమస్యలను కూడా అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం

- జయసూర్య, ఇన్‌చార్జి ఏఈ పంచాయతీరాజ్

సొంఠంవారిపల్లె, తిమ్మసముద్రం గ్రామ పంచాయతీల్లో విలేజ్ హెల్త్ క్లీనిక్ నిర్మాణాలు పునాది దశలో ఆగిపోయాయి. ప్రభుత్వం నుంచి టెండర్లు పిలిచిన తరువాత పనులు ప్రారంభిస్తాము. ఈడిగపల్లె, సుండుపల్లె-2 విలేజ్ క్లీనిక్‌లు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభిస్తాము. మూడుచోట్ల విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి.

పునాదులు కూడా పూర్తి చేయలేదు

- బాలాజీనాయక్, గుండ్లపల్లి



గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లేదు. విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మించి గ్రామాల్లోనే వైద్యం అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు పునాదులు కూడా నిర్మించకలేకపోయారు. గుండ్లపల్లె నుంచి సుండుపల్లెకు వైద్యం కోసం పోవాలంటే రోగులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కూడా లేదు. ఏ విధంగా వైద్యం పొందాలో అర్థం కాని పరిస్థితి మాది.

సచివాలయం, విలేజ్ హెల్త్‌క్లీనిక్ నిర్మాణం ఒక కల

- రమణ, టీడీపీ మండల బీసీ కన్వీనర్



సచివాలయం, విలేజ్ హెల్త్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రాలు కలలో కూడా పూర్తయ్యేలా లేవు. మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో పునాదుల దశకే పరిమితమయ్యాయి. మడితాడు గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు కనీస భవనాలు నిర్మించలేని దౌర్భాగ్య పరిస్థితి మండలంలో ఉంది. ప్రజలకు మంచి చేయాలని ఈ ప్రభుత్వానికి ధ్యాస ఉంటే ఇప్పటికే భవన నిర్మాణాలు పూర్తయి ఉండేవి.

ఎమ్మెల్యేతో మాట్లాడి తేదీలు ఖరారు చేస్తాం

- అమర్‌నాథ్, ఎంపీడీవో, సుండుపల్లె

ఈడగపల్లె సచివాలయం పూర్తయింది. త్వరలో ప్రారంభిస్తాము. ఎమ్మెల్యేతో మాట్లాడి తేదీ ఖరారు చేస్తాము. వీలైనంత త్వరగా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను ప్రారంభిస్తాము.

బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం : చమర్తి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, మార్చి 6: బీసీల అభ్యున్నతే తెలుగుదేశ పార్టీ, జనసేన లక్ష్యమని, బీసీలకు పెద్దపీట వేసిన ఘనత టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు దక్కుతుందని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు తెలిపారు. బుధవారం సుండుపల్లె మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రంలో నియంత పాలనకు తెరలేపారని రానున్న ఎన్నికల్లో వైసీపీని రాష్ట్ర ప్రజలు చిత్తుచిత్తుగా ఓడిస్తారని తెలియజేశారు. వైసీపీ పాలనలో బీసీలకు తీరని అన్యాయం చేశారని, జగన్ పాలనలో సుమారు 350 మందికిపైగా బీసీలను హత్య చేశారని పేర్కొన్నారు. బీసీల కోసం టీడీపీ జనసేన ఉమ్మడిగా ప్రకటించిన సంక్షేమ పథకాలు చారిత్రాత్మకంగా నిలిచిపోతాయన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా బీసీలకు అండదండగా తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు టీడీపీ ప్రభుత్వం కల్పిస్తే పది శాతం రిజర్వేషన్లు జగన్ తగ్గించారని అన్నారు. కులాల వారీగా, మతాల వారీగా బటన్ నొక్కి రాష్ట్ర ప్రజలను వంచించారని ఎద్దేవా చేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి ఒక్కరూ వైసీపీ ప్రభుత్వాన్ని ఛీకొడుతున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీకి అండగా నిలవాలని, టీడీపీ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన మండల మహిళా అధ్యక్షురాలు రెడ్డిరాణి, వీరబల్లి టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుబ్బరామరాజు, ప్రసాద్‌రాజు, ఎల్‌వీ రమణ, గ్రామ అధ్యక్షుడు సుబ్బరాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రుడి కల్యాణోత్సవం

- ఘనంగా క్షేత్ర పాలక కాలభైరవ హోమం
- భక్తిశ్రద్ధలతో భద్రకాళి అమ్మవారి సుమంగళి పూజ

రాయచోటిటౌన్, మార్చి 6: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ తేదీ బుధవారం వీరభద్రుడి కల్యాణం వైభవంగా జరిగింది. రెండోరోజు ఉదయం క్షేత్రపాలక కాలభైరవ స్వామి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కమనీయంగా, అత్యంత రమణీయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కన్నుల పండువగా జరిగిన వీరభద్రుడి కల్యాణోత్సవానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాత్రి జరిగిన భద్రకాళీ అమ్మవారి సుమంగళి పూజలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో సుమంగళి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భద్రకాళీ సమేత వీరభద్రుడు మయూర వాహనంపై పట్టణ పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే నిర్వహించిన సంకీర్తనలు భక్తులను అలరించాయి.


భద్రకాళీ సమేత వీరభద్రుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

ఒక్కసారి గెలిపించండి.. మీ రుణం తీర్చుకుంటా : మండిపల్లి


టీడీపీ జెండాఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, మార్చి 6: రాబోయే ఎన్నికల్లో తనను ఒకసారి గెలిపిస్తే.. పాలేటమ్మ సాక్షిగా రాయచోటి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాజకీయంగా తమ కుటుంబానికి 40 సంవత్సరాల నుంచి ఆనవాయితీగా వస్తున్న చిన్నమండెం మండలం కలిబండ గ్రామంలోని పాలేటమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి ఆశీర్వాదంతో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య తెలుగుదేశం పార్టీ జెండాను ఊపి.. ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మరో 40 రోజుల్లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయభేదాలు పక్కన పెట్టి రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ రాజంపేట ఎంపీ అభ్యర్థి, రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా క్షేత్రస్థాయి నుంచి ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని తెలిపారు. ఐదు సంవత్సరాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసిందన్నారు. ఇసుక అక్రమ రవాణా, జే బ్రాండ్ మద్యంతో అధికార పార్టీ నాయకులు కోట్లాది రూపాయలు సంపాదించారన్నారు. నవరత్నాల పేరుతో పేదలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు, టీడీపీ గెలుపు రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. గాడి తప్పిన పాలనను పట్టాలెక్కించే సామర్థ్యం ఉన్న నాయకుడు చంద్రబాబు ఒక్కరే అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనుభవించిన బాధలు తెలుగుదేశం పార్టీ పాలనలో ఉండవన్నారు. తనను గెలిపిస్తే వెనుకబడిన రాయచోటి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వంటి ముఖ్యనాయకుల పర్యటనలు నియోజకవర్గంలో ఉంటాయని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేసి తెలుగుదేశం జెండా ఎగిరేలా చూడాలని కోరారు.

డిగ్రీ కళాశాల స్థలానికి కంచె

- సరిహద్దులు గుర్తింపు
- సిమెంటు స్తంభాలు పాతిన విద్యార్థినులు



హద్దులు గుర్తిస్తున్న రెవెన్యూ సిబ్బంది, సిమెంట్ స్తంభాలు నాటుతున్న విద్యార్థినులు

కలికిరి, మార్చి 6: స్థానిక ప్రభుత్వ మహిళా రెసిడెన్షియల్ కళాశాలకు చెందిన విలువైన భూమికి ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు సరిహద్దులు గుర్తించారు. ఆ వెంటనే ఆలస్యం చేయకుండా అప్పటికప్పుడు సిమెంటు స్తంభా లు తెప్పించి విద్యార్థినులే నడుం బిగించి సరిహద్దుల్లో స్తంభాలను పాతి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఒక్క కూలి మనిషి సహాయం కూడా లేకుండా విద్యార్థినులంతా కలిసికట్టుగా తమ కళాశాల భూమిని ఆక్రమణలకు గురి కాకుండా కాపాడుకున్నారు. కంచె ఏర్పాటు కోసం కలెక్టరు ఇచ్చిన హామీ కంచికి వెళ్లిందని బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో జిల్లా అధికారులు ఆఘమేఘాలపైన స్పందించారు. జాయింట్ కలెక్టరు విషయాన్ని తీవ్రంగా పరిగణించడంతో బుధవారం మధ్యాహ్నానికల్లా హద్దులు గుర్తించే పనిని పూర్తి చేశారు. మరోవైపు అంతే వేగంగా కళాశాల విద్యార్థినులు సైతం తమ భూమి హద్దుల వరకూ గుర్తించిన చోట సిమెంటు స్తంభాలను పాతి పెట్టారు. విద్యార్థినులే స్వయంగా బరువైన సిమెంటు స్తంభాలను మోసుకొచ్చి గుంతలు తవ్వి వాటిల్లో స్తంభాలను పాతిపెట్టి మట్టితో పూడ్చారు. మొత్తం మీద లెక్కిస్తే 8 ఎకరాలపై చిలుకుగా భూమి తేలింది. సరిగ్గా నాలుగు లేన్ల జాతీయ రహదారికి ఆనుకునే వుండటంతో ఎంత తక్కువగా లెక్కేసినా ఎకరా రూ.నాలుగైదు కోట్లకు పైబడే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన భూమి విలువ కనీసం రూ. 40 కోట్లకు దాటిపోతుందని కూడా చెబుతున్నారు.

పట్టుబట్టి సాధించిన విద్యార్థినులు : స్థానిక మహిళా రెసిడెన్షియల్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినులు చుట్టుపక్కల గ్రామాల వారో, పీలేరు నియోజకవర్గం వారో మాత్రం కాదు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మెరిట్ ప్రాతిపదికన ఎంపికై ప్రవేశాలు పొందిన వారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నడుస్తున్న రెండు కళాశాలల్లో ఇదొకటి. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఈ కళాశాల ప్రతిష్టాత్మకమైందిగా చెబుతారు. దీనికి తగ్గట్టే విలువైన కళాశాల ఆట స్థలం అన్యాక్రాంతం కాకుండా విద్యార్థినులు పట్టుబట్టి మరీ దక్కించుకున్నారు. మిట్ట మధ్యాహ్నం ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా హద్దుల్లో స్తంభాలు పాతడం వరకూ చెమటోడ్చి పూర్తి చేశారు. వీరి కాయకష్టాన్ని చూసి పలువురు అభినందించారు. అంతేగాకుండా విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకులని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ గులాబ్‌జాన్, ఇతర మహిళా అధ్యాపకులు విద్యార్థినులకు చేదోడుగా నిలిచారు. గురువారం నుంచి కూలీలను పెట్టి తాత్కాలికంగా ముళ్ల కంచెను వేయిస్తామని చెప్పారు. తాటిగుంటపల్లె వీఆర్వో నారాయణ, సర్వేయరు నితీష్‌కుమార్ తదితరులు హద్దులు గుర్తించే పనిని పూర్తి చేశారు. స్వాధీనం చేసుకున్న భూమి నుంచి గతంలోని ఆంజనేయస్వామి ఆలయానికి, రైతుల భూములకు వెళ్లేందుకు దారి కోసం ఎంత భూమిని మినహాయిస్తారనేది వేచి చూడాలి.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



బ్యాటరీ సైకిల్స్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 6: దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో రాయచోటి నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ ట్రై సైకిల్స్ వినికిడి యంత్రాలను ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని 613 మంది విభిన్న ప్రతిభావంతులకు 1,03,97,155 విలువ చేసే పరికరాలు అందచేసినట్లు తెలిపారు. ప్రభుత్వం విలువైన పరికరాలు ఉచితంగా అందజేయడం జరిగిందని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారందరికీ అర్హత మేరకు పరికరాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమశాఖ అధికారి కృష్ణకిశోర్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా వేమన సతీష్



రాజంపేట, మార్చి 6: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా వేమన సతీష్‌వేమన సతీష్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రచార బాధ్యతల్లో కీలక పాత్ర పోషించాల్సిందిగా వేమన సతీష్‌ను పార్టీ నాయకులు ఆదేశించారు. గతంలో ఆయన తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా, తానా అధ్యక్షుడిగా పనిచేసి మంచి గుర్తింపు పొంది ఉన్నారు. ఈ సందర్భంగా వేమన సతీష్ మాట్లాడుతూ తనను రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నియమించడం సంతోషదాయకమన్నారు. తాను వచ్చే ఎన్నికల్లో కీలక పాత్ర పోషించి విస్తృతంగా పార్టీ గెలుపుకు కృషి చేస్తానన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు

ముగ్గురు జిల్లా క్రీడాకారిణులు



పి.లావణ్య



నాగపూజిత



దేవిక


కడప (స్పోర్ట్స్), మార్చి 6: జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారిణులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఆర్గనైజేషన్ సెక్రటరీ చిన్నపరెడ్డి, శివప్రసాద్ తెలిపారు. పాలగిరి లావణ్య, వై.నాగపూజిత, వి.దేవిక ఎంపికయ్యారన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం హత్రాస్‌లో ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న 52వ జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. ఆ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు విజయం సాధించి జిల్లా ఖ్యాతిని చాటాలని వారు ఆకాంక్షించారు.

విద్యుత్ చౌర్యంపై దృష్టి సారించండి

విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు

కడప (నాగరాజుపేట), మార్చి 6 : విద్యుత్ చౌర్యంపై దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ టెక్నికల్ డైరెక్టరు ఎన్‌వీఎస్ సుబ్బరాజు అధికారులను ఆదేశించారు. కడప పర్యటనలో భాగంగా మొదట 33/11 కేవీ ఎన్‌జీఓ కాలనీ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పగటిపూట వీధిలైట్లు వెలగకుండా తగు చర్యలు తీసుకుని విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు. అనంతరం ఎన్జీవో కాలనీ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కడప డివిజన్ పరిధిలోని కడప, సీకేదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు విడుదల చేయడంలో జాప్యం చేయకూడదన్నారు. కడప డివిజన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, వీటిని తగ్గించేందుకు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులకు అంతరాయాలు లేని నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శివాలయాల్లో అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ, సీనియర్ అకౌంటు ఆఫీసరు మధు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నరసింహ ప్రసాద్, హరిసేవనాయక్, ఏఈలు, అకౌంట్స్ విభాగం తదితరులు పాల్గొన్నారు.


ఇండియా కూటమిని గెలిపించండి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 6 : ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు, ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరంలోని రహ్మతీయ ఫంక్షన్‌హాలులో సీపీఐ ఉమ్మడి కడప జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఓబులేసు, ఈశ్వరయ్య హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం కనుమరుగై రాచరిక వ్యవస్థ మొదలవుతుందన్నారు. ఏటా రూ.2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మోదీ చేసిందేమీ లేదన్నారు. దేశ ప్రజలకు ద్రోహం చేసి కార్పొరేట్ వ్యక్తుల ప్రయోజనాల కోసం పాటుపడుతున్న బీజేపీని ఓడించాలన్నారు. రాష్ట్ర విభజనలో ఉన్న ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు, పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర హక్కులు, ప్రయోజనాలను పాలక ప్రతిపక్షాలు ఢిల్లీ పాలకుల వద్ద తాకట్టు పెట్టారని వారు విమర్శించారు. వ్యక్తిగత ప్రయోజనాలు, అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు బీజేపీకి వత్తాసు పలుకుతున్నారని, ఇటువంటి నాయకులను ఓడించాలన్నారు. సమావేశంలో అన్నమయ్య జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి మహేశ్, జిల్లా సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఉమ్మడి జిల్లాల కార్యవర్గసభ్యులు రామయ్య, నాగసుబ్బారెడ్డి, రాధాక్రిష్ణ, బషీరున్నీసా, జి.వేణుగోపాల్, కేసీ బాదుల్లా, సుమిత్ర, కోటీ, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

సేవాశ్రమంలో గుర్తు తెలియని బాలిక



వివేకానంద సేవాశ్రమంలో ఉన్న గుర్తుతెలియని బాలిక

కాశినాయన మార్చి6: కాశినాయన మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డునున్న వివేకానంద సేవాశ్రమంలో గుర్తుతెలియని బాలిక ఉందని సేవాశ్రమ నిర్వాహకురాలు రామతులసి తెలిపారు. ప్రొద్దుటూరులోని బొల్లవరంలో రోడ్లపై తిరుగుతున్న బాలికను స్థానికులు గుర్తించి వివేకానంద సేవాశ్రమానికి బుధవారం అప్పగించారన్నారు. బాలికను విచారించగా తనపేరు దుర్గాఅని అమ్మ రాణి,నాన్న నరసింహుడు అని మాది బాపట్ల అంటూ తడబడుతూ సమాధానం చెబుతోందన్నారు. ఆచూకీ తెలిసిన బంధువులుగాని ,కుటుంబసభ్యులుగాని,తల్లిదండ్రులుగాని ఆశ్రమానికి వచ్చి బాలికను తీసుకొని పోవచ్చునన్నారు.



మందు బాబుల జేబుకు చిల్లు

- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో..
- ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయాలు
- బెల్టుషాపులకు సరఫరా ఫుల్
- ప్రేక్షక పాత్రలో సంబంధిత అధికారులు



మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్‌ఫొటో)

బద్వేలు, మార్చి 6: అధికారంలోకి వస్తే మద్య నిషేధం చేపడతామని ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గట్టిగా హామీ ఇచ్చారు. అధికారం చేపట్టాక.. మద్య నిషేధం అమలు చేయకపోగా అడిగినంత మద్యం అందుబాటులోకి తెచ్చారు. పల్లెపల్లెనా బెల్టుషాపులు దర్శనమివ్వడమే దీనికి నిదర్శనం. గతంలో కాంట్రాక్టర్లు మద్యం షాపులు నిర్వహించేవారు. వారి షాపులకనుగుణంగా అక్కడక్కడా బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు చేసేవారు. జగన్ అధికారం చేపట్టాక ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడుపుతుండటంతో... పట్టణాలు మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో సైతం విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహించి మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. చీప్‌లిక్కర్ ప్రభుత్వ మద్యం షాపులో రూ.130 ఉండగా బెల్టుషాపులో రూ.200కు విక్రయిస్తున్నారు. చీప్ లిక్కర్‌తో పాటు ఇతర బ్రాండ్లన్నీ క్వార్టర్‌పై రూ.50లు అదనంగా చెల్లించుకోవాల్సి వస్తోందని మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్య నిషేధం మాట గాలికొదిలేసి విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తుండటంపై మహిళలు ఆందోళన చెందుతున్నారు.

> **బెల్టుషాపులు నిర్వహిస్తే జైలుకే**
>
> **- మంజుల, ఎక్సైజ్ సీఐ, బద్వేలు**
>
> ఎవరైనా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు నిర్వహిస్తే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. బద్వేలు ఎక్సైజ్ పరిధిలో నెల వ్యవధిలో 50 మందిపై కేసు నమోదు చేసి 250 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నాం. పల్లెల్లో బెల్టుషాపుల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బెల్టుషాపులు నిర్వహిస్తూ వరుసగా నాలుగుసార్లు పట్టుబడితే పీడీయాక్ట్ నమోదు చేస్తాం.

మందుబాబుల జేబుకు చిల్లు

మద్యం ప్రభుత్వ దుకాణాలలో మాత్రమే అమ్ముతుండటంతో ఎమ్మార్పీ ధరలకు కాకుండా ఇష్టానుసారంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.10 నుంచి రూ.20 అదనంగా చెల్లిస్తే బెల్టుషాపుల వారికి కావలసినంత మద్యం అందిస్తున్నట్లు సమాచారం. వాటిని తీసుకుని పల్లెలో బెల్టుషాపుల ద్వారా క్వార్టర్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు చేస్తున్నారు. ఉదయం 11 గంటల వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరవరు.. ఈలోపు తాగేవారు బెల్టుషాపులను ఆశ్రయిస్తున్నారు. ఇక బెల్ట్‌షాపుల వారికి పెద్దమొత్తంలో మద్యం అమ్మేస్తుండటంతో ప్రభుత్వ మద్యం దుకాణంలో మిగిలిన మద్యానికి డిమాండ్ పెరుగుతోంది. దీంతో మందుబాబుల అవసరాన్ని బట్టి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కొత్తరకం బెల్టుషాపులు

బెల్ట్‌షాపులు ఇప్పుడు గతంలో లాగా నిర్వహించడం లేదు. బెల్టుషాపు నిర్వాహకులు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచే రూ.10 లేదా రూ.20 అదనంగా చెల్లించి కావలసినన్ని మద్యం సీసాలు ఒకేసారి తీసుకెళ్లి ఇంట్లో లేదా దుకాణంలో పెట్టుకుంటారు. ఎవరైనా ఫోన్ చేసి ఫలానా చోట ఉన్నామని చెబితే వీరే అక్కడికి వెళ్లి బాటిల్‌పై రూ.50 నుంచి రూ.100 అదనంగా తీసుకుని మద్యం ఇచ్చి వస్తారు. ఫోన్‌పే చేసినా చాలు.. మందుబాబులు ఉన్న చోటుకే మద్యం చేరుస్తారు. దీంతో బెల్టుషాపులను అరికట్టడం పోలీసులకు సవాల్‌గా మారిందని అంటున్నారు.

ప్రేక్షక పాత్రలో ఎక్సైజ్ అధికారులు

ప్రభుత్వ మద్యం దుకాణాలలో మద్యం అధిక ధరలకు అమ్మకుండా చూడ్డంతో పాటు, బెల్టుషాపులు అరికట్టడంలో ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ప్రేక్షకపాత్రతో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహించడంతో పాటు ఎమ్మార్పీకంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి మద్యం దుకాణాలలో ఎమ్మార్పీ రేట్లకే అమ్మేలా చర్యలు చేపట్టాలని మందుబాబులు కోరుతున్నారు.

ఎవడబ్బ సొత్తని ఏపీఎండీసీని తాకట్టు పెట్టారు

● టీడీపీ, జనసేన నేతల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్ర, చంద్రమోహన్

ఓబులవారిపల్లె, మార్చి 6: ఏపీఎండీసీని రాష్ట్ర ప్రభుత్వం ఎవడబ్బ సొత్తని తాకట్టు పెట్టిందని జనసేన, టీడీపీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. మంగంపేటలో బుధవారం ఏర్పాటు చేసిన జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కార్యాచరణ సమావేశంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ సీనియర్ నాయకుడు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్ మాట్లాడారు. మీ తాత, తండ్రికి రాజకీయ భవిష్యత్తుకి ఆర్థిక అండగా నిలిచిన సంస్థను తాకట్టు పెట్టడం అంటే కన్న తల్లిని తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. ఏపీఎండీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో మంజూరైన వాటర్‌ప్లాంట్‌లు 68 వస్తే వాటిలో 66 చిత్తూరుకే తరలించారని, 12 కమ్యూనిటీ హాల్‌లు ఇస్తే మొత్తం చిత్తూరుకే కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో పుంగనూరు, పీలేరు ఇతర ప్రాంతాల వారే ఉన్నారని తెలిపారు.

స్థానిక యువతకు, ఏపీఎండీసీ కోసం భూములు, ఇళ్లను వారికి ఇప్పటికీ న్యాయం చేయలేదని, స్థానిక శాసనసభ్యులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. మంగంపేట సంస్థలో సీనియర్స్‌గా ఉన్న ఎస్సీ, బీసీ అధికారులను కాకుండా వారికి అనుకూలంగా పనులు చేయించేందుకే సీపీవోగా సుదర్శన్‌రెడ్డిని తెచ్చుకున్నారని ఆరోపించారు. సంస్థలో జరిగే అక్రమాలపై రాబోయే రోజుల్లో పూర్తి స్థాయిలో ఉద్యమిస్తామని తెలిపారు. తల్లి లాంటి సంస్థను తాకట్టు పెట్టేబదులు, ఇడుపులపాయ, బెంగళూరులో ఉన్న మీ ప్యాలస్‌లు తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చుకోవచ్చుకదా సీఎంగారూ అంటూ ఎద్దేవా చేశారు. డేంజర్ జోన్ పరిధిలో ఉన్న స్థానికులకు న్యాయం చేయాలని కోరిన తమపై కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థకు భూములు, ఇళ్లు ఇచ్చి కట్టు బట్టలతో బయటికి వెళ్లిన వారికి సరైన న్యాయం జరగలేదని, వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి రాగానే తప్పు చేసి వారిపై చర్యలు తీసుకునేలా తమ అధిష్ఠానం నాయకుల దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు. కార్యక్రమంలో జనసేన రాయలసీమ కన్వీనర్లు జోగినేని మణి, పగడాల వెంకటేష్, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు, నారదాసు కృష్ణయ్య, పగడాల చంద్రశేఖర్, పసుపులేటి వెంకటరమణ, విజయ్‌కుమార్, వీరంద్ర, శివప్రసాద్, అనుమలగుండం హరికృష్ణ, మణి, సునీల్ తదితర టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్‌యాదవ్



రాయచోటిటౌన్, మార్చి 6: జిల్లా సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమల శాఖ ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యుడిగా భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చీర్ల శ్రీనివాస్‌యాదవ్‌ను నియమిస్తూ కేంద్ర మంత్రి నారాయణ్‌రాణే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులు, యువ పారిశ్రామిక వేత్తలకు కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ప్రారంభించడానికి ఎన్నో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

మహిళలను గౌరవించే సంస్కారం పెరగాలి



జిల్లా అధికారులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : సమాజంలో మహిళలకు సత్కారాలు అవసరంలేదని, వారికి సరైన గౌరవం ఇచ్చే సంస్కారం అందరిలో పెరగాల్సిన అవసరం ఉందని జిల్లా మహిళా అధికారులు అభిప్రాయపడ్డారు. బుధవారం స్టెప్ కార్యాలయంలో ప్రపంచ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు సరస్వతి మాట్లాడుతూ సమాజంలో మహిళ గురుతర బాధ్యత వహిస్తుందని, సమాజం ఉన్నతిలో ఆమె పాత్ర ఎన్నదగినదన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా మహిళలకు సరైన స్థానం లభిస్తున్నా వర్కింగ్ ప్లేస్‌తో పాటు పలు చోట్ల మహిళలకు వేధింపులు తప్పడంలేదని, మహిళల పట్ల చిన్న చూపు తగదన్నారు. అనంతరం స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమాధికారి వల్లూరు బ్రహ్మయ్య, హాస్టలు వెల్ఫేర్ ఆఫీసరు ఆరోగ్య, ఉపాధ్యాయురాలు సావిత్రి మాట్లాడారు.

వెనుకబడిన వర్గాలకు మహర్దశ

టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న యాటగిరి రాంప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 6 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో వెనుకబడిన తరగతులకు మహర్దశ లభించనుందని టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ మంగళగిరిలో నాగార్జున యూనివర్సిటీ ప్రాంతంలో 10 అంశాలతో కూడిన బీసీ డిక్లరేషన్‌లో లక్షలాది మంది బీసీల సమక్షంలో ప్రకటించడం హర్షణీయమన్నారు. 50 సంవత్సరాలకే బీసీలకు రూ.4వేలు పెన్షన్ చట్టం, సబ్‌ప్లాన్ నిధులను లక్షా 50వేల కోట్లకు పెంచనున్నట్లు పేర్కొనడం, ఇలాంటి మరెన్నో హామీలు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాదవ సాధికార సమితీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, యాదవ్, ఆవుల వెంకటేశ్, పోలి సాయి, రాము పాల్గొన్నారు.

మైనార్టీ మంత్రిగా అంజద్‌బాషా క్రైస్తవులకు ఏం చేశారు

టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు



మాట్లాడుతున్న క్రిస్టియిన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 6 : మైనార్టీ మంత్రిగా అంజద్‌బాషా క్రైస్తవులకు ఏం చేశారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు ప్రశ్నించారు. టీడీపీ హయాంలోనే క్రైస్తవులకు గుర్తింపు లభించిందని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం ద్వారకానగర్‌లో టీడీపీ క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో పాస్టర్ల సదస్సును కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 వైసీపీ మేనిఫెస్టోలో క్రిష్టియన్‌ల కోసం ఆరు వాగ్దానాలు చేసి ఒక్కటి కూడా సీఎం జగన్ నెరవర్చలేదన్నారు. ప్రధానంగా విదేశీ విద్య, చర్చిల నిర్మాణం, జెరూసలేం యాత్ర ఇలా క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు ప్రవేశపెట్టారన్నారు. అయితే క్రైస్తవులకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి క్రైస్తవులను విస్మరించారన్నారు. మైనార్టీ మంత్రిగా కడప జిల్లాకు చెందిన అంజద్‌బాషా కూడా క్రైస్తవులకు మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. చంద్రబాబును సీఎంను చేసుకోవలసిన ఆవశ్యకత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, నమితారెడ్డి, చంద్రశేఖర్, కొమ్మలపాటి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం భుజంగేశ్వరాలయం

- మట్లిరాజుల కాలంలో నిర్మించిన ఆలయం
- మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

రైల్వేకోడూరు, మార్చి 6: పట్టణ నడిబొడ్డున వెలసి ఉన్న భుజంగేశ్వరాలయం భక్తులకు కొంగు బంగారంగా నిలిచింది. ఈ ఆలయాన్ని 200 సంవత్సరాల కిందట నిర్మించారని చరిత్ర ద్వారా చెబుతోంది. మట్లిరాజుల కాలంలో ఆలయాన్ని నిర్మించారు. మట్లిరాజులు ప్రతి కార్తీకమాసంలో వచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించేవారని చరిత్ర చెబుతోంది. స్వామి వారికి అవసరమైన పూలు, నైవేద్యాలను తీసుకుని వచ్చేవారు. కార్తీకమాసంలో మట్లిరాజులు మొదటి పూజలు నిర్వహించేవారు. తర్వాత వై.కోటలో వెలసి ఉన్న నీలకంఠేశ్వరస్వామికి పూజలు నిర్వహించే వారు. వెంకటగిరి సంస్థానం నుంచి గుర్రాలు, ఏనుగుల మీద ప్రత్యేకంగా స్వామి వారికి కానుకలు తెచ్చేవారని చరిత్ర చెబుతోంది. ఈ ఆలయం ఆవరణంలో వినాయకుడు, సుబ్రమణ్యంస్వామి, దక్షిణామూర్తి, మహావిష్ణువు, వీరభద్ర, నవగ్రహాలు తదితరవి ఉన్నాయి. భుజంగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని ఇక్కడి భక్తుల విశ్వాసం. శివుడి విగ్రహం చిన్నదిగా ఉంటుంది. పార్వతి విగ్రహం పెద్దదిగా ఉంటుంది. శివుడు తూర్పు దిక్కున చూస్తున్నట్లు, పార్వతి అమ్మవారు దక్షిణ దిక్కున చూస్తున్నట్లుంటుంది. మట్లిరాజులు కోడూరు ప్రాంత ప్రజలకు మంచి జరగాలని విగ్రహాలను తమిళనాడు నుంచి వేదపండితుల చేత ప్రతిష్ఠ చేయించారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. 20 ఏళ్లకు ముందు ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. గత చైర్మన్లు నార్జాల రాజన్న, పోతురాజు చంద్ర, ఉంగరాల నాగేంద్ర, మందల గీత, మందల ప్రవీణ్, పరిటాల జగన్నాథం, శోడిశెట్టి ప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో దాతలు ముందుకు వచ్చి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ముందుభాగంలో మండపం, నవగ్రహాలు, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామి, దక్షిణామూర్తి, తదితర వాటిని దాతలు నిర్మించారు. ఆలయ కమిటీ చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 8న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలతో పాటు అన్నదానాలు నిర్వహిస్తారు. ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా రంగులు తదితర పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ ఆలయం ఎంతో ప్రాచుర్యం పొందింది.



కోడూరు నడిబొడ్డున వెలసి ఉన్న భుజంగేశ్వర స్వామి ఆలయం, మట్లిరాజుల కాలం నాటి శివలింగం, భువనేశ్వరి అమ్మవారు

శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు



ఈనెల 8వ తేదీ మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాము. భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని తగిన ఏర్పాట్లు చేస్తాము. దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారుల సహకారంతో చలువ పందిర్లు, బారికేడ్లు తదితర కార్యక్రమాలు చేపడతాము. భక్తులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చేస్తాము. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తారు. అన్నదానాలు, తీర్థ ప్రసాదాలు భక్తులకు ఏర్పాటు చేస్తారు. ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది సహకారంతో పనులు పూర్తి చేస్తున్నాము.

- పోకల సుబ్బరాయుడు, భుజంగేశ్వరస్వామి ఆలయ చైర్మన్

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిపెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 6: గ్రామాలలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధి కారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సభాభ వనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని శాఖల అధికారులతో ఆయా సమస్యలపై చర్చించారు. మండలంలో చాల గ్రామాలలో తాగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంచాయతీ వీఆర్వోలు, గ్రామాలలో పర్యవేక్షణ చేసి సమస్యలు గుర్తించాలన్నారు. బోర్లు వేయడమా లేదా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈనెల 11, 12 తేదీలలో జరగబోవు గంగమ్మ జాతరలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు తెలియజేశారు. జడ్పీటీసీ సభ్యులు అంబాబత్తెన రమాదేవి, తహశీల్దారు కుమార్, ఎంపీడీవో వెంకటరమణారెడ్డి, ఎంఈఓ చక్రేనాయక్, ఏపీఓ పెంచలయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రవిరాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్, మార్చి 6: రాయచోటి పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు అధికారి డాక్టర్ శైలజ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్కానింగ్ సెంటర్లలోని వివిధ రకాల రికార్డులను పరిశీలించి.. అక్కడ రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలకు అనుగుణంగా స్కానింగ్ నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

హాల్ మార్క్‌పై అవగాహన అవసరం

రాయచోటిటౌన్, మార్చి6: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ హాల్‌మార్క్‌పై గ్రామ పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు అవ గాహన అవసరమని స్టేట్ అబ్జర్వర్ రాంబాబు, రమేశ్‌లు అన్నారు. బుధవారం రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిధిలోని పెద్దమండెం, పెనగలూరు, పీలేరు, పెద్దతిప్పసముద్రం, పుల్లంపేట, రాజంపేట, రామాపురం మండలాలకు సంబంధించిన సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు మూడో రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసే సిమెంటు, స్టీలు, వ్యవసాయ పనిముట్లు, స్టేషనరీ, ఎలక్ట్రికల్ కేబుల్స్ తదితర వస్తువులకు తప్పనిసరిగా హాల్ మార్క్ ఉండే వస్తువులనే కొనుగోలు చేయాలని సూచించారు. ఏపీఎస్ఐఆర్డీ రీసోర్స్ పర్సన్స్, రాజంపేట, మదనపల్లె డివిజినల్ పంచాయతీ అధికారులు, ఆయా మండలాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

5వ రోజు ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

రాయచోటిటౌన్, మార్చి 6: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 5వ రోజు బుధవారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 54 పరీక్షా కేంద్రాల్లో 17086 మంది విద్యార్థులకు 16048 మంది పరీక్షలకు హాజరు కాగా 1038 మంది గైర్హాజరయ్యారు. రాయచోటి పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను డీఐఈవో కృష్ణయ్య తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద బయట వ్యక్తులు ఎవరు కనిపించకూడదని, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరిండెంట్ అధికారులు, డిపార్టుమెంట్ అధికారులతో పాటు రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాల అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

రామాపురం, మార్చి 6: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను బుధవారం అన్నమయ్య జిల్లా ఆర్డీవో రంగస్వామి తనిఖీ చేశారు. మండలంలోని సరస్వతిపల్లె, సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డి గారిపల్లె, నీలకంఠ్రావుపేట, గోపగుడిపల్లె, గువ్వల చెరువు, నల్లగుట్టపల్లెలలో పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని వసతులు కల్పించాలని వీఆర్‌వోలకు సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్‌సరఫరా, నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ అరవింద్‌కిశోర్, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

చాందినీ బండ్లకు అనుమతి తప్పనిసరి

రామాపురం, మార్చి6: లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మజాతరలో చాందినీ బండ్లు కట్టేవారు ముందుగా పోలీసులు అనుమతి తప్పక తీసుకోవాలని ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో గంగమ్మ జాతర ప్రశాంతంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్క రూ సహకరించాలన్నారు. చాందినీ బండ్లు 10 అడుగులు ఎత్తుకంటే ఎక్కువ ఏర్పాటు చేయకూడదన్నారు. బండి వెనుక నృత్యాలు, ప్రదర్శ నలు ఏర్పాటు చేయకూడదని.. కేవలం సాంప్రదాయబద్ధంగా బండ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. చాందినీ బండ్లు జాతీయరహదారిపై వెళ్లేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ఉరుసులో సుగవాసి ప్రత్యేక ప్రార్థనలు



చిన్నమండెం, మార్చి 6: మండల కేంద్రంలో వెలిసిన హజరత్ షా అలీ గంజే షహిద్‌బాబా రహంతుల్లా అలైహి ఉరుసు వేడుకల్లో రాజంపేట టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా బాలసుబ్రమణ్యంకు మైనార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహిద్‌ఖాన్, రాంప్ర సాద్‌నాయుడు, బాలచంద్రయాదవ్, ఇర్షాద్‌ఖాన్, సైపుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో వైసీపీకి భారీ షాక్

- టీడీపీ తీర్థం పుచ్చుకున్న ప్రముఖ వైసీపీ నేతలు



మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు కోడిశ్రీను, సల్లావుద్దీన్, చెన్నూరు అన్వర్‌బాషా, జాఫర్‌అలీఖాన్

రాయచోటిటౌన్, మార్చి 6: రాయచోటి పట్టణానికి చెందిన ప్రముఖ వైసీపీ నేతలు బుధవారం 100 కుటుంబాలతో కలిసి టీడీపీలో చేరారు. రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. రాయచోటి పట్టణానికి చెందిన మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యుడు సల్లావుద్దీన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మెన్ చెన్నూరు అన్వర్‌బాషా, ప్రముఖ పారిశ్రామిక వేత్త మడితాడి శ్రీనివాసులురెడ్డి (కోడి శీను), మాజీ కౌన్సిలర్లు గంగిరెడ్డి, సంజీవ్‌రెడ్డిలు వందలాది మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో తరలివచ్చి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ పరిధిలోని మైనార్టీలు మా కుటుంబ సభ్యులుగా వెన్నంటి ఉన్నారని.. వారి కష్టసుఖాల్లో తమ కుటుంబం పాలు పంచుకుంటామన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్ మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డిని ఈసారి ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపించడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ మైనార్టీల్లో టీడీపీకి ఆదరణ పెరుగుతోందని, ఈసారి ఎన్నికల్లో రాంప్రసాద్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో జాఫర్‌అలీఖాన్, గఫార్‌బాషా బియ్యం అంగడి హబీబ్, పలువురు మైనార్టీ నేతలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రూ.20 వేలు ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, మార్చి 6: ఓబులవారిపల్లెలో పక్షవాతంతో బాధపడుతున్న పంక్చర్‌షాపు నిర్వా హకుడు రవి భార్యకు టీడీపీ యువనాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా సాయం అందించారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసులురెడ్డి, కె.మల్లికార్జునరెడ్డి, పున్నాటి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ క్లీనిక్ ప్రారంభం

రామాపురం, మార్చి 6: మండలంలోని బండపల్లె గ్రామంలోని పొత్తుకూరు పల్లెలో బుధవారం విలేజ్ క్లీనిక్‌ను ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ క్లీనిక్ ఏర్పాటుతో గ్రామీణ ప్రజలకు సొంతూరులోనే ప్రాథమిక వైద్య చికిత్సలు అందుబాటులోకి వస్తాయన్నారు. మాజీ ఎంపీపీలు గడికోట జనార్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కదిరన్న, కృష్ణారెడ్డి, జడ్పీటీసీ మానస వెంకట్రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సంబేపల్లె, మార్చి 6: మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లె వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహులు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గుట్టపల్లెకు చెందిన నరసింహులు ద్విచక్రవాహనంలో రోడ్డు దాటుతుండగా గాలివీడు నుంచి తిరుపతికి వెళుతున్న కారు ఢీకొనడంతో గాయపడటంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఒంటిమిట్టలో... : కడప-చెన్నై జాతీయ రహదారిపై స్థానిక ఎంఆర్‌వో కార్యాలయం వద్ద జరిగిన ప్రమాదంలో కుమ్మరపల్లెకు చెందిన పోలయ్య అనే వ్యక్తికి గాయాలయ్యాయి. కడప వైపు నుంచి తిరుపతి వైపు వెళుతున్న మినీ లారీ ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన పోలయ్యను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా. ప్రథమ చికిత్స అనంతరం 108లో రిమ్స్‌కు తరలించారు.

మల్లాలమ్మదిన్నెల్లో ప్రత్యామ్నాయ పాఠశాల ప్రారంభం

పెనగలూరు, మార్చి 6: కట్టావారిపల్లె పంచాయతీ పరిధిలోని మారుమూల అటవీ గ్రామం మల్లాలమ్మదిన్నెలో బుధవారం ప్రత్యామ్నాయ పాఠశాలను పెనగలూరు ఎంఈవో-1 గిరివరదయ్య, ఎంఈవో -2 పి.నాగసుబ్బరాయుడు ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పనతల సురేష్ ఆధ్వర్యంలో ఎంఈవో సహకారంతో రెగ్యులర్ ఉపాధ్యాయుని నియమించి బుధవారం పాఠశాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తోట శ్రీనివాసులు, జేపీ ఎస్ వర్మ, ఎ.సుబ్బారావు, మన్నెం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జనసేన ప్రచార రథాలు ప్రారంభం



సిద్దవటంలో ప్రచార రథాలను ప్రారంభిస్తున్న అతికారి దినేష్, వెంకటయ్య, జనసేన ప్రచార వాహనాలు

రాజంపేట, మార్చి 6: రాజంపేట, సిద్దవటం ప్రాంతాల్లో జనసేన పార్టీ ఏర్పాటు చేసిన ప్రచార రథాలను జనసేన, టీడీపీ నాయకులు ప్రారంభించారు. రాజంపేట మన్నూరు యల్లమ్మ ఆలయంలో, సిద్దవటంలో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రచార రథాలను ప్రారంభించారు. నియోజకవర్గంలో ప్రచారంలో ఉపయోగించుకునేందుకు జనసేన పార్టీ నాయకులు కొట్టే ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వాహనాలను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అతికారి దినేష్, జనసేన సీనియర్ నేత అతికారి వెంకటయ్య ప్రారంభించారు. టీడీపీ నాయకులు మోదుగుల పెంచలయ్య, రాజంపేటలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకుందాం : టీడీపీ

పెనగలూరు, మార్చి 6: రైల్వేకోడూరు నియోజకవర్గంలో కలిసికట్టుగా టీడీపీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేద్దామని మండల టీడీపీ నాయ కులు పిలుపునిచ్చారు. బుధవారం పెనగలూరు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నేతలు, కస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు సమావేశమయ్యారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతి నిధి కొత్త బాలకృష్ణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంయుక్తంగా పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్లమెంటు రైతు అధ్యక్షుడు పెరుగు కృష్ణయ్య నాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు ఎస్.రామ్ ప్రసాద్‌నాయుడు, టీడీపీ నాయకులు ఎం.లక్ష్మీ నరసయ్య, జేసీ సుబ్బయ్య, కె.జయరామ్, ఎస్.మురళీ, ధనయ్య పాల్గొన్నారు.

సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం

నందలూరు, మార్చి 6: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సచివాలయం-3, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ లో కొత్తగా మంజూరైన 367 ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జంబు సూర్యనారాయణ, మైనుద్దీన్, మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, వక్ఫ్‌బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్, రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మండల విద్యాశాఖాధికారిణి సస్పెన్షన్?

ఓబులవారిపల్లె, మార్చి 6: మండల విద్యాశాఖాధి కారిణిగా పనిచేస్తున్న పద్మజ సస్పెండ్ అయినట్లు తెలిసింది. గత కొద్ది నెలలుగా ఆమెపైన పుస్తకాల గోలుమాల్, అలాగే కొన్ని అవకతవకలకు పాల్పడినట్లు విచారణ జరుగుతున్న నేపథ్యంలో బుధవారం ఆమెకు అధికారిక మెయిల్‌కు ఆర్‌జేడీ రాఘవరెడ్డి సస్పెన్షన్ ఉత్తర్వులు పంపినట్లు తెలిసింది.

గంగమ్మ ఆలయ చైర్మన్‌గా రెడ్డెయ్య ప్రమాణస్వీకారం



ఆలయ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న రెడ్డెయ్య, కమిటీ సభ్యులు

లక్కిరెడ్డిపల్లె మార్చి 6: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి దేవస్థాన ఆలయ చైర్మన్‌గా మురికినాటి రెడ్డెయ్య బుధవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా రెడ్డెయ్యతో పాటు 10 మంది ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన చైర్మన్ రెడ్డెయ్య మాట్లాడుతూ గంగమ్మతల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 11, 12 తేదీలలో జరగబోవు గంగమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సమర సింహారెడ్డి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి రవీంద్రరాజు, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట నారాయణరెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే లక్ష్యం



శెట్టిగుంటలో ప్రచారం నిర్వహిస్తున్న రేవతి

రైల్వేకోడూరు, మార్చి 6: చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామంలో పార్టీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు సహకారంతో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో టీడీపీని అధికారంలోకి తేవడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామున్ని దర్శించుకున్న అమరావతి ఎస్‌బీఐ సీజీఎం



ఒంటిమిట్ట, మార్చి 6: ఒంటిమిట్ట కోదండరామస్వామిని బుధవారం అమరావతి సర్కిల్ ఎస్‌బీఐ సీజీఎం నవీన్ చంద్ర సతీసమేతంగా దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఆలయ రంగమండపంలో వారిని ఆలయ సిబ్బంది సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కవిత, సిబ్బంది చైతన్య, ఎస్‌బిఐ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమాచార్య ఫార్మసీలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం

రాజంపేట టౌన్, మార్చి 6: రాజంపేట మండలం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో బుధవారం జాతీయ ఫార్మసీ విద్యాదినోత్సవం సందర్భంగా ఫార్మా అన్వేషణ్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రొఫ్ మహదేవ లాల్ ష్రాఫ్ జన్మదినం సందర్భంగా ఫార్మసీ రంగానికి చేసిన సేవలకు ఫాదర్‌ఆఫ్ ఫార్మసీ ఎడ్యుకేషన్ ఇండియా గుర్తింపు పొందారని... ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఔషధరంగంలో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజాభివృద్ధి

చిట్వేలి, మార్చి 6 : మహిళలు సామా జికంగా, ఆర్థికంగా ఎదిగినప్పుడే సమా జాభివృద్ధి సాధ్యమని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొ న్నారు. బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు వసుంధరమ్మ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో సభాభవనంలో అంతర్జా తీయ మహిళా దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమా నికి హాజరైన ఎమ్మెల్యే మహిళా దినో త్సవ కేకును కట్ చేసి మహిళలందరికీ శుభాకాంక్షలు తెలి యజేశారు. చిట్వేలి ప్రాజెక్టు గ్రేడ్-1 సూపర్ వైజర్లు విజ యకుమారి, విశాలాక్షి, గ్రేడ్-2 సూపర్ వైజర్ సురేఖ రాణి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

రాయచోటిటౌన్, మార్చి 6: పేదల భూములను కబ్జా చేస్తున్న భూకబ్జా దారు లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పూనపాటి రమణ అన్నారు. బుధవారం రాయచోటి పట్టణ పరిధిలోని దుర్గమ్మ గుడి వద్ద కొంత మంది భూకబ్జాదారులు దౌర్జన్యంగా చెక్‌డ్యాంలను సైతం పగలగొట్టి యంత్రా లతో చదును చేయడమే కాకుండా పేదల భూము లను కూడా కబ్జా చేశారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయ కులు వెంకటసుబ్బమ్మ, సుజాత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీగా షమీఉల్లా ఖాన్

నందలూరు, మార్చి 6: నందలూరు జూనియర్ సివి ల్ జడ్జి కోర్టులో ఏజీపీగా షమీఉల్లా ఖాన్ నియ మితులయ్యారు. ఈసందర్భంగా షమీఉల్లాఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్‌అండ్ జస్టిస్ రాష్ట్ర కార్యదర్శి జి.సత్య ప్రభాకర్ రావు నుంచి తనకు నియామక ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. ఈ నియామకం ప్రకారం మూడు సంవత్సరాల పాటు ఏజీపీగా కొనసాగుతానని తెలిపారు.



దశకంఠుడిపై భవుడి విలాసం



ముక్కంటి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు రావణ బ్రహ్మ వాహనంపై కొలువుదీరగా, జ్ఞానప్రసూనాంబ మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవళ్లి, దేవసేన సమేత కుమార స్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప కొలువుదీరి ఊరేగారు.ఉదయం ఆలయ అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో పూజలు చేసి పురవిహారానికి తీసుకువచ్చారు.వాయులింగేశ్వరుడు హంస వాహనంపై, జ్ఞానప్రసూనాంబ యాళి వాహనంపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. కోలాటాలు, బ్యాండు వాయిద్యాల సందడి, శివనామస్మరణలతో చతుర్మాడ వీధులు మార్మోగాయి.

- శ్రీకాళహస్తి

తిరుమలేశుడి సేవలో జూనియర్ శ్రీదేవి

దివంగత సినీనటి శ్రీదేవి కుమార్తె, హీరోయిన్ జాన్వీకపూర్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన పిన్నమ్మ అయిన నటి మహేశ్వరితో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. జాన్వీకపూర్‌కు వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయం ముందు జాన్వీకపూర్‌ను చూసేందుకు యాత్రికులు ఉత్సాహం చూపారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

అవార్డందుకున్న వినుకొండ



ప్రముఖ డోలు విద్వాంసుడు వినుకొండ సుబ్రమణ్యం బుధవారం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్నారు.గూడూరు మాళవ్యానగర్‌కు చెందిన ఆయన ఆలిండియా రేడియో టాప్‌గ్రేడ్ ఆర్టిస్టుగా 40 సంవత్సరాలకు పైగా దేశమంతా డోలు కచేరీలు చేశారు. సుబ్రమణ్యం ప్రావీణ్యతను గుర్తించిన కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆయన్ను అవార్డుకు ఎంపిక చేసింది.ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బుధవారం పురస్కారాన్ని స్వీకరించారు.పలువురు కళాకారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

- గూడూరు

ఎంపీడీవోకు, ఏవోకు నోటీసులు

గుడిపాల, మార్చి 6: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ నుంచి గుడిపాల ఎంపీడీవో, ఏవోకు నోటీసులు జారీ అయ్యాయి. గురువారం హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. మండలంలోని పాపిశెట్టిపల్లి కాలనీకి చెందిన నంబిక్‌రాజ్ సమాచార హక్కు చట్టం కింద 2023 సెప్టెంబరు 8న దరఖాస్తు చేసుకున్నారు. నిర్ణీత కాలవ్యవధిలో సమాచారం ఇవ్వకపోవడంతో అప్పిలేట్ అథారిటీకి అప్పీల్ చేసుకున్నారు. అక్కడినుండి సరైన సమాచారం రాకపోవడంతో కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవడంతో వారి నుంచి పౌరసమాచార అధికారి అయిన గుడిపాల ఏవో, అప్పిలేట్ అథారిటీ అధికారి అయినఎంపీడీవోకు నోటీసులు వచ్చాయి.

సజావుగా ఎన్నికలు నిర్వహిస్తాం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సమీక్షలు - సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టామని, అవసరమైన సిబ్బంది ఏర్పాటు, సెక్టోరల్ అధికారులకు శిక్షణ ఇచ్చామని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్యతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్‌ను డీఆర్డీఏ మీటింగ్ హాలులో ఏర్పాటు చేస్తామని, పోలింగ్ అనంతరం ఈవీఎంలను భారీ భద్రత నడుమ కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటినుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి తు.చ. తప్పకుండా పాటించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బంది అవసరమని, వారికి ఎన్నికల శిక్షణ అందిస్తామని చెప్పారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్ (టీడీపీ), ఉదయ్ కుమార్ (వైసీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), లోకేష్ (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారాల కోసం ముద్రించే అన్ని రకాల కరపత్రాల్లో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు డీఆర్వో పుల్లయ్య సూచించారు. కరపత్రాలు, స్టిక్కర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీల కింద ప్రింటింగ్ ప్రెస్ పేర్లు.. ఎన్ని కాపీలు ముద్రించారనే వివరాలూ ఉండాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ప్రింట్ చేసి తరలిస్తే చెక్‌పోస్టుల వద్ద ఒకవేళ తనిఖీల్లో పట్టుబడితే నిబంధనల ప్రకారం అభ్యర్థి ఎన్నికల ఖర్చు కింద వాటిని జమచేస్తామన్నారు. డ్వామా పీడీ రాజశేఖర్, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

మంత్రి సమావేశానికి హాజరు కాకుంటే చర్యలు!

మహిళా టీచర్లకు పుత్తూరు డీవైఈవో హెచ్చరిక

పుత్తూరు అర్బన్, మార్చి 6: మహిళా దినోత్సవం పేరుతో మంత్రి రోజా నిర్వహించతలపెట్టిన సమావేశానికి మహిళా టీచర్లు హాజరు కాకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ పుత్తూరు డీవైఈవో హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వున్న నేపథ్యంలో మంత్రి రోజా ఒక రోజు ముందుగానే 7వ తేదీన సాయంత్రం 4 గంటలకు పుత్తూరు ఎన్జీవో కాలనీ సమీపంలోని షాదీ మహల్‌లో సమావేశం జరపాలని నిర్ణయించారు. ఎన్నికల నేపథ్యంలో రోజా ఏదో ఒక వర్గంతో సమావేశమై మద్దతు కోరుతున్న మంత్రి రోజా ఈ సమావేశానికి మహిళా టీచర్లను రప్పించాలని ఆదేశించారో లేదో తెలియదు గానీ పుత్తూరు డీవైఈవో మాత్రం ఎంఈవో 1, ఎంఈవో 2లతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు వాట్సప్ మెసేజీలు పంపించారు. మంత్రి నిర్వహిస్తున్న సమావేశానికి మహిళా టీచర్లు తప్పనిసరిగా హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అందులో స్పష్టం చేశారు.మహిళా దినోత్సవం ముందు రోజే నిర్వహిస్తుండడం ఒకటైతే, సాయంత్రం 4 గంటలకు సమావేశానికి రావాలంటే స్కూళ్ళ నుంచీ టీచర్లు పని వేళలు ముగియక ముందే బయల్దేరాల్సి వుంటుంది. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఈ పనులకు మళ్ళీ బెదిరింపులేమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.మంగళవారం పుత్తూరులో అంగన్వాడీ కార్యకర్తలతో ఇదే విధంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. దీనికి కూడా మంత్రి రోజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి కూడా ఖచ్చితంగా రావాలని అంగన్వాడీలపై ఒత్తిడి తీసుకురావడం వివాదాస్పదమైంది.అధికార పార్టీ నేతలకు సంబంధించిన కార్యక్రమాలన్నింటికీ బెదిరింపులు, హెచ్చరికలతో ఆయా వర్గాలను హాజరు చేయించడానికి అధికారులు యత్నిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



చిత్తూరు సిటీ, మార్చి 6: తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్‌కుమార్, చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరారు. చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 2, 16, 17, 18, 50వ డివిజన్ నుంచి సుమారు 400 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. వీరికి చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్మోహన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, నేతలు యువరాజ్, గౌతమ్, మౌళి, అశోక్, ఉదయ్, రుద్ర, చిట్టిబాబు, వరుణ్ చౌదరి, నంద, కిరణ్, నవీన్, కిషోర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

● చిత్తూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఏజీఎం



రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న గుంతకల్లు ఏజీఎం ధనంజయలు

చిత్తూరు రూరల్, మార్చి 6: అమృత భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆధునికీకరిస్తోంది. ఈ క్రమంలో గుంతకల్లు డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఏజీఎం ధనంజయలు బుధవారం పరిశీలించారు. అందులో భాగంగా చిత్తూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. త్వరగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని స్పష్టంచేశారు. ఆయన వెంట డివిజన్ స్థాయి అధికారులు, స్టేషన్‌మాస్టర్ ముత్తుస్వామి తదితరులు ఉన్నారు.

ఏజీఎం వస్తారని..

తనిఖీ నిమిత్తం ఏజీఎం ధనంజయలు వస్తున్నారని తెలిసి స్థానిక అధికారులు చిత్తూరు రైల్వే స్టేషన్‌ను ముస్తాబు చేశారు. ప్లాట్‌ఫాంను శుభ్రంగా ఉంచారు. కాచిగూడ రైలు ఎక్కాలంటే మూడో ప్లాట్‌ఫాంకి వెళ్లాల్సిందే. దీని కోసం అర కిలోమీటరు దూరం వెళ్లి వంతెన ఎక్కేందుకు భయపడి రైలు ట్రాక్‌ను దాటి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో కొన్ని ప్రమాదాలు జరిగినాఅధికారులు పట్టించుకోలేదు. ఎప్పుడూ మూడో ప్లాట్‌ఫాంలోనే కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను ఉంచేవారు. కానీ, బుధవారం మాత్రం ఏజీఎం వస్తున్నారని ఒకటో ప్లాట్‌ఫాంలోకి తెచ్చి ఉంచారు. ఆయన వెళ్లిపోగానే తిరిగి మూడో ప్లాట్‌ఫాంలోకి మార్చారు.

తిరుపతి అసెంబ్లీ సీటు జనసేనకే!

చంద్రబాబు, పవన్ భేటీలో నిర్ణయం ● ఆరణి శ్రీనివాసులు, గంటా నరహరి తదితరుల పేర్లతో సర్వే

● నరసింహ యాదవ్, సుగుణమ్మలకు టీడీపీ అధిష్ఠానం నుంచీ పిలుపు

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గత రెండు నెలలుగా మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల్ని తికమకపెడుతూ వచ్చిన తిరుపతి అసెంబ్లీ సీటు కేటాయింపు విషయంలో స్పష్టత వచ్చింది. ఈ స్థానాన్ని మిత్రపక్షమైన జనసేనకు కేటాయించింది తెలుగుదేశం పార్టీ. ఇరు పార్టీల అధినేతలూ బుధవారం జరిపిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిజానికి టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు కుదుర్చుకున్నప్పటి నుంచీ తిరుపతి అసెంబ్లీ సీటు జనసేన పార్టీకే కేటాయిస్తారన్న అంచనాలు మొదలయ్యాయి.అయితే అర్థబలం, అంగబలం, అధికార బలాలతో పాతుకుపోయిన ప్రత్యర్థి పార్టీ నేతలను ఎదుర్కొనేందుకు అవసరమైన వనరుల్లో జనసేన నాయకులు వెనుకబడ్డారు. ఆ కారణంగా ఓ దశలో జనసేన తరపున ఉమ్మడి అభ్యర్థి బరిలో వుండరన్న ప్రచారం ప్రారంభమైంది. అయితే చివరికి బుధవారం ఇరు పార్టీల అధినేతలూ జరిపిన సమావేశంలో తిరుపతి సీటును పొత్తులో భాగంగా జనసేనకు ఖరారు చేశారు. అధికార పార్టీ అభ్యర్థిని దీటుగా ఎదుర్కొనేందుకు తగిన వనరులున్న అభ్యర్థిని ఎంపిక చేసే దిశగా జనసేన, టీడీపీ అధినేతలు అన్వేషణ మొదలుపెట్టినట్టు సమాచారం. అందులో భాగంగా దివంగత డీకే ఆదికేశవులుతో బంధుత్వం, పుష్కలంగా అర్థబలం కలిగిన గంటా నరహరి పేరు ప్రధానంగా పరిశీలనలోకి వచ్చినట్టు తెలిసింది. అదే సమయంలో ఇటీవలే జనసేనాని పవన్ కళ్యాణ్‌ను కలసిన చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వీరిద్దరితో పాటు తిరుపతి జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ తదితరుల పేర్లు కూడా కలుపుకుని గురువారం నుంచీ ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించనున్నట్టు సమాచారం.

స్థానికులకే టికెట్ ఇవ్వాలని బలిజల డిమాండ్

తిరుపతి సీటు జనసేనకు ఖరారైన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ స్థానికులకే ఇవ్వాలన్న డిమాండ్ మొదలైంది. నియోజకవర్గంలో ప్రాబల్యం కలిగిన బలిజ సామాజికవర్గంలో పలువురు తిరుపతి టికెట్ స్థానికేతరులకు ఇవ్వరాదని కోరుతున్నారు. గురువారం లేదా శుక్రవారం ఆ సామాజికవర్గానికి చెందిన ముఖ్యులతో సమావేశం నిర్వహించి స్థానికులకే టికెట్‌ఇచ్చేలా తీర్మానంచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో వేచి చూడాల్సివుంది. ఈ నేపథ్యంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలకు అధిష్ఠానం నుంచీ పిలుపు వచ్చింది. గురువారం ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయం చేరుకోవాలని బుధవారం సాయంత్రం వారిద్దరికీ పిలుపు వచ్చింది.దీంతో నరసింహయాదవ్ బుధవారంరాత్రే బయల్దేరి వెళ్ళగా సుగుణమ్మ గురువారం ఉదయం వెళుతున్నట్టు సమాచారం. అక్కడ వారు తొలుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో సమావేశం కానున్నారు. తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించిన నేపథ్యంలో వారికి అధిష్ఠానం నిర్ణయం గురించి వివరించేందుకు, జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరేందుకు పిలిపించినట్టు తెలుస్తోంది. వీరిద్దరూ టికెట్ రేసులో నిలిచిన ప్రధాన ఆశావహులు కావడాన అధిష్ఠానం నిర్ణయం పట్ల వీరి అభిప్రాయం ఎలా వుంటుందో కూడా చూడాల్సి వుంది. అదే సమయంలో ఊకా విజయ్‌కుమార్ పేరు కూడా టీడీపీ టికెట్ రేసులో ప్రముఖంగా వినిపించిన సంగతి తెలిసిందే. ఆయన ఎలా స్పందిస్తారో తెలియడం లేదు. ప్రజారాజ్యం పార్టీలో గతంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయనకు చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లతో సన్నిహిత సంబంధాలున్న నేపథ్యంలో ఆయన పేరు కూడా జనసేన అధినేత పరిగణనలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం

గంగాధరనెల్లూరు, మార్చి 6: గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో పాటు మిచాంగ్ తుఫానుతో పంట నష్టపోయిన 4,604మంది రైతులకు నష్టపరిహారం కింద రూ.2.78 కోట్లు లబ్ధి చేకూరనుందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ మొత్తాన్ని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సీఎం జగన్ నగదు జమను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వ్యవసాయశాఖ జేడీ మురళీక్రిష్ణ, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుబు వెంకటరెడ్డి, మండల ఆర్‌బీకే అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ బలరామిరెడ్డి, నగరి, చిత్తూరు వ్యవసాయశాఖ ఏడీలు సౌభాగ్యలక్ష్మి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు



రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న కుప్పాల సత్యనారాయణ

తిరుపతి (ఆటోనగర్) మార్చి 6: అయోధ్యను సందర్శించే భక్తుల కోసం తిరుపతి నుంచి బుధవారం ఉదయం ప్రత్యేక రైలు బయలుదేరింది. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ బీజేపీ నాయకులతో కలిసి పచ్చజెండా ఊపి రైలును ప్రారంభించారు. అయోధ్యలో నిర్మించిన రామ మందిరాన్ని దర్శించుకోవడానికి ఐఆర్‌సీటీసీ దేశ నలుమూలల నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా తిరుపతి నుంచి అయోధ్యకు 24 కోచ్‌లతో ప్రత్యేక రైలును ఉదయం 7 గంటలకు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 10.35 గంటలకు అయోధ్యధాంకు చేరుకుంటుందని డైరెక్టర్ తెలిపారు. తిరిగి శనివారం రాత్రి 7.55 గంటలకు అయోధ్యధాంలో బయలుదేరి సోమవారం రాత్రి 11.45 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. ప్రారంభోత్సవంలో బీజేపీ నాయకులు జి.భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, చంద్రప్ప, పి.చంద్రశేఖర్, ముని సుబ్రమణ్యం, వి.పద్మ, వేదవతిరాయల్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.91 కోట్లు

తిరుమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.91 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 64,552 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,900 మంది తలనీలాలు సమర్పించారు.

మీడియా ప్రతినిధులపై కేసులు ఎత్తివేయండి

● పెద్దపంజాణి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలంటూ ఏఎస్పీకి వినతిపత్రం



చిత్తూరు ఏఎస్పీ ఆరీఫుల్లాకు ఫిర్యాదు ఇస్తున్న జర్నలిస్టులు

వి.కోట/ చిత్తూరు, మార్చి 6: వి.కోటలో మీడియా ప్రతినిధులపై పోలీసులు నమోదు చేసిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని ప్రెస్‌క్లబ్ తరపున జిల్లా అదనపు ఎస్పీ ఆరీఫుల్లాను బుధవారం కోరారు. సోమవారం రాత్రి పుష్పపల్లకీ సేవ సందర్భంగా చోటు చేసుకున్న అంశాలను ఆయనకు వివరించారు. కవరేజ్ కోసం వెళ్లిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరిని అడ్డుకుని, అతడికి మద్దతు తెలిపిన మరో ముగ్గురు మీడియా ప్రతినిధులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి, తిరిగి తమపైనే కేసులు పెట్టారని వివరించారు. తమ విధులకు పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు ఆటంకం కలిగించి.. తమను దుర్భాషలాడి, తమపైనే కేసులు పెట్టారంటూ ఏఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై విచారించి ఆ ఎస్ఐపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. తాము సమగ్ర విచారణచేసి ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హామీ ఇచ్చారు. తమ పై అకారణంగా నమోదైన రెండు కేసులను ఎత్తివేయాల ని జర్నలిస్టులు కోర గా.. ఎస్పీతో సంప్రదిం చి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. వి.కోట ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మీడియాపై కేసులు సరికాదు: బీజేపీ

ప్రజల పక్షాన నిలిచి నిజాలను నిర్భయంగా రాసే మీడియా ప్రతినిధులపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షైందల రామచంద్రుడు అన్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు.

పోలీసులను సస్పెండు చేయాలి

పుంగనూరు: వి.కోటలో మీడియా పట్ల దురుసుగా ప్రవర్తించి, వారిపైనే అక్రమ కేసులునమోదుచేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండపల్లె అక్కులప్ప బుధవారం డిమాండు చేశారు. సమస్య ఏర్పడితే కనీసం పిలిచి మాట్లాడకుండా అక్రమ కేసులు బనాయించేందుకు పోలీసులు తెగబడ్డారంటే ఇక సామాన్య ప్రజల విషయంలో ఎలా ప్రవరిస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఈ అక్రమ కేసులను వెనక్కి తీసుకుని.. పెద్దపంజాణి ఎస్ఐని సస్పెండు చేయాలన్నారు.

10వరకు చెన్నై సెంట్రల్-తిరుపతి రైళ్ల రద్దు

● 11నుంచి తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి

పెరంబూర్, మార్చి 6: తిరుపతి సెక్షన్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా తిరుపతికి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేయగా, మరికొన్ని పాక్షికంగా, మరికొన్నింటిని ఇతర మార్గాల్లో నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది. ● నెం.06728 తిరుపతి - మూర్ మార్కెట్ కాంప్లెక్స్, నెం.06727 మూర్ మార్కెట్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 10వ తేదీ వరకు రద్దు. ● నెం.16854 విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్, నెం.16853 తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 14వ తేదీ వరకు రద్దు ● నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో, నెం.06754 తిరుపతి - అరక్కోణం మెమో రైళ్లు ఈ నెల 10వ తేదీ వరకు రద్దు. ● నెం.17407 తిరుపతి - మన్నార్‌గుడి పమని ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10, 12, 14 తేదీలు, నెం.17408 మన్నార్‌గుడి - తిరుపతి పమని ఎక్స్‌ప్రెస్ ఈనెల 11, 13, 15 తేదీల్లో రద్దు. ● నెం.16112 పుదుచ్చేరి - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ ఈనెల 12 నుంచి 23 వరకు, నెం.16111 తిరుపతి - పుదుచ్చేరి మెమో ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి 24వ తేదీ వరకు రద్దు.

తిరుపతికి బదులుగా తిరుచానూరు... : నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో, నెం.06727 మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు తిరుపతికి బదులుగా తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయి. నెం.06754 తిరుపతి - అరక్కోణం మెమో ఎక్స్‌ప్రెస్, 06728 తిరుపతి - మూర్ మార్కెట్ కాంప్లెక్స్ మెమో ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి బయల్దేరుతాయి.

రేణిగుంట వరకే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ : నెం.16057 చెన్నై సెంట్రల్ - తిరుపతి, నెం.16053 చెన్నై సెంట్రల్- తిరుపతి మధ్య నడిచే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 23వ తేది వరకు తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తాయి. అలాగే, నెం.16058 తిరుపతి- చెన్నై సెంట్రల్, నెం.16054 తిరుపతి - చెన్నై సెంట్రల్ సప్తగిరి రైళ్లు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతాయి.

టీడీపీ, జనసేన ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు!

పీలేరు, మార్చి 6: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ, కేవీపల్లె మండలం తిమ్మాపురం పంచాయతీల్లో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి బుధవారం ఆయన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే విజన్ ఉన్న చంద్రబాబు, కమిట్‌మెంట్ ఉన్న పవన్ కళ్యాణ్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుతు న్నారన్నారు. సంక్షేమ పథకాల పేరిట రూ.10లు చేతిలో పెట్టి రూ.100లు లాగేసుకుంటున్నారని తెలిపారు. 2014లో లోటు బడ్జెట్‌తో పరిపాలన ప్రారంభించిన చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా చూసుకున్నారని, సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. రహదారులను అభివృద్ధి చేశారని, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రాన్ని తాము అభివృద్ధి పథంలో నడుపుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు లక్షలాది కోట్ల బిల్లులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో, సాక్షాత్తు సచివాలయ భవనాలను ఎందుకు తాకట్టు పెట్టుకున్నారో ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల సమీపిస్తున్న కొద్దీ వైసీపీ నాయకలు తాయిలాలతో మరోమారు మభ్యపెట్టాలని చూస్తారని, వారి కుయుక్తులు నమ్మకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తిమ్మాపురంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ మాజీ కార్యదర్శి తిమ్మాపురం రఘురామిరెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆయనను కిశోర్ టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు రాజకీయ పరిజ్ఞానం, అనుభవం ఉన్న వాళ్లందరూ టీడీపీ, జనసేనకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కావలిపల్లెలో వైసీపీ నేత ప్రభాకర్ నాయుడు తన అనుచరులు, బంధువులతో కలిసి టీడీపీలో చేరారు. వారందరినీ కిశోర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సూరా సుధాకర్ రెడ్డి, నాయకులు మల్లారపు రవి ప్రకాశ్ నాయుడు, సీవీ రెడ్డి, మద్దిపట్ల శ్రీనివాసులు నాయుడు, గిరి నాయుడు, చిన్నా, వెంకటేశ్, నరసింహులు నాయుడు, రియాజ్, రాజగోపాల్ నాయుడు, ఎంసీ పాళెం కేసీఆర్, శ్రీధర్, మల్లిఖార్జున, ఎస్కే నాయుడు, పార్థ సారథి, ఆనంద్ రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనాథరెడి పాల్గొన్నారు.


రఘురామిరెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

వాల్మీకిపురం: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట తప్పడం, తప్పుడు వాగ్దానాలతో మడమ తిప్పడం ప్రస్తుత వైసీపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజమని వాల్మీకిపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం మండలంలోని గంగాదొడ్డి గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వల్లిగట్ల వెంకటరమణ, వెంకటరమణ, సయ్యద్ బాషా, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, చాను, కువైట్ సయ్యద్ బాషా, డిష్ బ్రదర్స్, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, ఎండీ యూసుఫ్, కువైట్ బాబు, బొక్కసం బ్రదర్స్, సాదిక్, గాంధీపేట రెడ్డి, సర్దార్, సయ్యద్‌అమీర్, ఆలీ, సైదు, హనీఫ్, తోటవీధి ఫణి, బాలకృష్ణమ నాయుడు, రమేష్ బాబు, లోకేష్, నవీన్, ప్రసాద్, అరుణ్, సంతోష్, తరుణ్, మెకానిక్ చాను, సిద్దక్, గౌస్, ప్రసాద్, మహేష్, పవన్ కళ్యాణ్, శీను, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

ములకలచెరువు: బాబు ష్యూరిటీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి సతీమణి దాసరిపల్లి కల్పనరెడ్డి తెలిపారు. ములకలచెరువులోని వక్కలోళ్లగుట్ట, పాత ములకలచెరువు తదితర గ్రామాల్లో బుధవారం సూపర్ సిక్స్‌పై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు కేశవులు, గంగాదేవిలతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.


వాల్మీకిపురం : ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు


ములకలచెరువు: ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా : ఎస్ఈ


సబ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

తంబళ్లపల్లె, మార్చి 6: అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ క్రిష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన గుర్రంకొండ 132 కేవీ, తంబళ్లపల్లె మండలంలోని కుక్కరాజుపల్లె, కన్నెమడుగు 33/11 కేవి, ములకలచెరువు, పీటీఎం మండలాల్లోని విద్యుత్ ఉప కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలతో పాటు రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. కుక్కరాజుపల్లె విద్యుత్ ఉప కేంద్రంలో అదనంగా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్, కన్నెమడుగు ఉపకేంద్రంలో 3.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఏఈ శేషకుమార్‌ను ఆదేశించారు. ములకలచెరువు మండలంలో 2, బి.కొత్తకోటలో 2, పీటీఎంలో రెండు 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రాలు నూతనంగా మంజూరయ్యాయని, వీటి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజలు సౌర విద్యుత్ వినియోగించుకునేందుకు వీలుగా రాయితీతో కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ప్రవేశ పెట్టినట్లు ఎస్ఈ తెలిపారు. పక్కా ఇల్లు కలిగి ఉండి ఒకటి, రెండు అంతస్తులు కలిగిన వారు రాయితీతో ఇంటి పైకప్పుపై సోలార్ ప్లేట్లను అమర్చుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసి ఇచ్చి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ గరిష్ఠంగా రూ.78 వేలు రాయితీ పొందే అవకాశం ఉంటుందన్నారు. పథకానికి దరఖాస్తు చేసుకోదలచిన వారు ప్రస్తుత విద్యుత్ బిల్లు, ఇంటి పైకప్పు ఫొటోతో దగ్గరలోని పోస్టాఫీసు, విద్యుత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అనంతరం తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండ మల్లికార్జున స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట డీఈ యుగంధర్, ఏడీఈ రుక్మాంగదబాబు, ఏఈ శేషుకుమార్, ఎల్ఐ భాస్కర్, లైన్‌మెన్‌లు శంకర, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం


పోస్టల్‌బ్యాలెట్ కేంద్రం ఏర్పాటుకు పరిశీలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, మార్చి 6: మదనపల్లె నియోజకవర్గంలో ప ని చేస్తున్న ప్రభుత్వ ఉద్యో గులు పోస్టల్ బ్యాలెట్లు వేసేందుకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీవో హరిప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీసెంట్ హాల్లో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన సౌకర్యాలను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కావాల్సిన వారు ఈ పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఎన్నికల విధుల ఉత్తర్వులు చూపి, పోస్టల్ బ్యాలెట్ తీసుకుని, ఇక్కడే ఓటు వేసి బ్యాలెట్ బాక్సులో వేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సర్వేయర్ సుబ్రమణ్యం, ఎన్నికల డీటీ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై సిద్దేశ్వరుడు

కలకడ, మార్చి 6: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బుధవారం హంస వాహనంపై ఊరేగారు. వడ్డెర కులస్తుల ఆధ్వర్యంలో కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానాలు చేశారు. ఆలయ ధర్మకర్త అఖిలేష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కలకడ, మార్చి 6:కలకడ బాలికల గురుకుల పాఠశాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో 80 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర తెలిపారు. 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు ఆసక్తి గల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తులో ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న నిర్వహించనున్నట్లు తెలిపారు.

శంకర్‌యాదవ్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించాలి

● టీడీపీ కార్యకర్తల ఆందోళన

పెద్దతిప్పసముద్రం మార్చి 6 : తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ టికెట్ శంకర్‌యాదవ్‌కే ప్రకటించాలంటూ బుధవారం పీటీఎంలో ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, తెలుగు తమ్ముళ్లు, శంకర్ అనుచరులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్‌యాదవ్ సేవలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. లోకేష్ పాదయాత్ర, మదనపల్లెలో మినీ మహానాడు, పీటీఎంలో అన్న క్యాంటీన్‌ను పోలీసులతో అడ్డుకోవాలని చూసిన అధికార పార్టీ నాయకులను లెక్కచేయకుండా విజయవంతం చేశాడన్నారు. శంకర్‌యాదవ్‌ను తంబళ్లపల్లె తెలుగుదేశం అభ్యర్థిగా ప్రకటించి ఆయనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మద్దయ్యగారిపల్లె హరి, కట్టా సురేంద్ర నాయుడు, ఎస్సీ సెల్ కార్యదర్శి తమక శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి శివానంద, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గూటం ఈశ్వరప్ప, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, తాడిగోళ్లపల్లె సుధాకర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కత్తి ఆదినారాయణ, చింతకాయల వినోద్, రాము, మాజీ సర్పంచ్ ఇ.వి. రమణ, పకృద్దీన్, షఫీ, నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు మధుకర్‌యాదవ్, నాగరాజు యాదవ్, పెద్దన్న, రవీంద్ర, సాయి,లతో పాటు బి.కొత్తకోట టీడీపీ నాయకులు కుడుం శరత్, శ్రీనాథ్ నాయుడు, కుడుం రంజిత్, మహేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేంద్రబాబులతో పాటు అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో


సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ కొండయ్య

కలికిరి, మార్చి 6: మండలంలోని మహల్ పంచాయతీలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య సందర్శించారు. శిబిరంలో రోగులకు అందజేస్తున్న సేవలపై మేడికుర్తి వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప వివరించారు. హాజరయిన వారి నుంచి ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేశామని చెప్పారు. శిబిర నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా కళాశాలకు ప్యాడ్ వెండింగ్ యంత్రం వితరణ

మదనపల్లె టౌన్, మార్చి 6: మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు మదనపల్లె రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్ వెండింగ్, ఇన్సిరేటర్ యంత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ ఆర్. కృష్ణవేణి మాట్లాడుతూ ఇటలీ దేశానికి చెందిన ల్యూకోస్ అనే యువకుడు గత ఏడాది మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారని, ఆయన సహకారంతో రోటరీ క్లబ్ ద్వారా ఈ యంత్రాలను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు దేవతా శంకర్, నవీన్, చైతన్య, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం తరలిస్తున్న ఐదుగురు అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 6: గోవా మద్యం తరలిస్తున్న ఐదుగురిని మదనపల్లె ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం మదనపల్లె- బెంగళూరు మార్గంలోని చీకిలబైలు చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇన్నోవా కారులో తరలిస్తున్న రూ.23వేలు విలువ చేసే 19 గోవా మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. పీలేరు మండలం బోడుమలవారిపల్లెకు చెందిన దస్తగిరి కుమారుడు ఎస్..అహ్మద్‌బాషా(34), సహదేవరెడ్డి కుమారుడు ఎన్. రవీంద్రనాథ్‌రెడ్డి((44), సయ్యద్‌బాషా కుమారుడు ఎస్. ఫారుఖ్(24), చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు ఎం.కుమారనాథ రెడ్డి(41, కృష్ణయ్య కుమారుడు ఎ.బాలాజి((39)ని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ తనిఖీలో చెక్‌పోస్టు సీఐ మొహయిద్దీన్‌బాషా పాల్గొన్నారు.

వ్యవసాయ సాంకేతికతకు అందుబాటులో కేవీకే


రాగి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కలికిరి, మార్చి 6: వ్యవసాయ రంగంలో రైతులకు అవసరమైన ఆధునిక సాంకేతికత, పంట రకాలు, తెగుళ్ల నివారణకు స్థానిక కేవీకేలో వివిధ రకాల సేవలు అందుబాటులో ఉంటాయని, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ అధికారి డాక్టర్ బి.ముకుందరావు తెలిపారు. బుధవారం కేవీకేలో నిర్వహించిన శాస్త్రీయ సలహా మండలి 12వ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు కేవీకేలో నిర్వహిస్తున్న డెమో యూనిట్లు వానపాముల ఎరువుల తయారీ, కోళ్లు, పొట్టేళ్ల పెంపకం, షేడ్ నెట్‌లో మామిడి మొక్కల పెంపకం తదితరాలను పరిశీలించారు. ప్రథమ శ్రేణి ప్రయోగ ప్రదర్శన క్షేత్రాలపై కేవీకే శాస్త్రవేత్తలు వివరించారు.

వీరన్నకొండపై తిరుణాల

వాల్మీకిపురం, మార్చి 6: మహాశివరాత్రి పండుగ సందర్భంగా పట్టణ సమీపంలోని వీరన్నకొండపై తిరుణాల నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8వ తేదీ శుక్రవారం లింగోద్భవ అభిషేకం, గణపతి మృత్యుంజయ హోమం, 9న శనివారం ఉద యం పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మంగళ హారతి, పూజలు నిర్వహించనున్నారు.

తంబళ్లపల్లెను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతా

కురబలకోట, మార్చి 6: అన్ని విధాలా వెనకబడిన తంబళ్లపలె నియోజకవర్గాన్ని పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతానని టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మట్లివారిపల్లె, రామిగానిపల్లె, ఎర్రమద్దివారిపల్లె, మధ్యాహ్నంవారిపల్లె, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. రాజంపేట పార్ల మెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వై.జి.సురేంద్ర,తదితరులు పాల్గొన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

16న జాతీయ లోక్ అదాలత్

మదనపల్లె టౌన్, మార్చి 6: మదనపల్లె కోర్టులో ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రెండవ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎస్.శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకుని ప్రమాదపు కేసులు, సివిల్ కేసులు, ఇతర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకో వచ్చన్నారు.

విద్యార్థులు కళల్లో రాణించాలి

మదనపల్లె టౌన్, మార్చి 6: విద్యార్థులు చిన్నతనం నుంచే ఏదో ఒక కళలో రాణించాలని భాష్యం హైస్కూల్ జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక రెడ్డీస్ కాలనీలోని భాష్యం హైస్కూల్లో 14వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ, వెస్టన్ నృత్యాలు వేసి తల్లిదండ్రులను అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దురాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ షాబీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

గుర్రంకొండ, మార్చి 6: క్షయ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. మండలంలోని మర్రిపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకోవచ్చునన్నారు. క్రమం తప్పకుండా మందులను వాడడంతో వ్యాధి నుంచి పూర్తిగా కోటుకుంటారన్నారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండ ప్రాంతాలకు నిప్పు..

వాల్మీకిపురం, మార్చి 6: వాల్మీకిపురం పట్టణ సమీపంలో బుధవారం పట్టపగలే అటవీ ప్రాంతాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమీపంలోని నూరుకుప్పల కొండ, వీరన్న కొండ, బొమ్మకొండ, వానరగుట్ట తదితర ప్రాంతాల్లో అడవులు కాలి బూడిదయ్యాయి. వందల ఎకరాల పచ్చటి అటవీ ప్రాంతం పట్టపగలే నిలువునా కాలిపోతున్నా సంబంధిత అటవీ శాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తుండిపోయారు.

మాజీ సర్పంచు కుటుంబానికి పరామర్శ

కలికిరి, మార్చి 6: మండలంలోని గుండ్లూరు పంచాయతీ టీడీపీ మాజీ సర్పంచు వెంకటరమణాచారి కుమారుడు మణికంఠాచారి మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. విషయం తెలిసిన నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించా రు. భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచు సైఫుల్లా, మాజీ సర్పంచులు భాస్కర్ రెడ్డి, వెంకట్రమణ, మహ్మదాలీ, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ జడ్పీటీసీ మాలతి, ఐటీడీపీ అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు మున్వర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు మల్లయ్యకొండ ముస్తాబు


తంబళ్లపల్లె: మల్లయ్య కొండపై ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు


పీలేరు: ఉత్సవాలకు ముస్తాబవుతున్న మద్దుండాల మల్లేశ్వర స్వామి ఆలయం

తంబళ్లపల్లె, మార్చి 6: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని మహాశివరాత్రి ఉత్సవాలకు సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో కొండ ఎక్కే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఘాట్ రోడ్డు వెంబడి ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. . 8న ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేకాభిషేకాలు, సహస్ర నామార్చన, సాయంత్రం 6 గంటలకు కట్టా సంజీవ పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం, రాత్రి 12 నుంచి తెల్లవారు జాము 4 గంటల వరకు స్వామి వారి మెరవణి నిర్వహించనున్నారు. 9న ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఆలయ ఈవో రమణ, ఛైర్మన్ కేఆర్ మల్‌రెడ్డి తెలిపారు

మదనపల్లె అర్బన్: పట్టణంలోని పలు ఆలయాలు శివరాత్రి పర్వదినానికి సిద్ధమయ్యాయి. బుధవారం దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నీరుగట్టువారిపల్లె లోని నీలకంఠేశ్వరస్వామి, చిప్పిలి మడికయ్యల శివాలయం, కనకదాస్ నగర్ సమీపంలో సిద్ధిలింగేశ్వర స్వామి, సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి, రామిరెడ్డి లేవుట్‌లోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయా లు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ఆయా ఆలయ కమిటీల సభ్యులు, అధికారులు భక్తులకు అనుగుణంగా ఏర్పాటు చేశారు. నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు ఊరేగింపుగా తీసుకెళ్లి వినాయకుడికి సమర్పించారు.

పీలేరు: మండలంలోని కాశీ విశ్వేశ్వరుడు, మద్దుండాల మల్లేశ్వర స్వామి, భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయాలు మహాశివరాత్రి ఉత్సవాల కోసం ముస్తాబవుతున్నాయి. కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధ వారం సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. ఆలయంలో గంగపూజ, గణపతి ఆరాధన, స్వస్తి పుణ్యాహవచనం, కలశ స్థాపన, నవగ్రహ ఆరాధన చేశారు. మద్దుండాల ఆలయంలో శుక్ర వారం జాగారం, శనివారం ఝరిస్నానం ఉంటుంది. భ్రమరాంబ మల్లికా ర్జున స్వామి ఆలయంలో శుక్రవారం రుద్రనమక, చమక, పురుషసూక్త అర్చన, రాత్రి శ్రీ వేంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన, శనివారం గార్గేయనదిలో ఝరిస్నానం ఏర్పాటు చేసినట్లు అర్చకులు తెలిపారు.

కలికిరి: మండలంలోని గుట్టపాలెం పూలకొండలోని మల్లేశ్వరస్వామికి శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు బాలరెడ్డెప్ప నాయునివారు, వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం ఉదయం మహన్యాసపూర్వక అభిషేకాలు, సాయంత్రం సహస్రనామ లక్ష బిల్వార్చన జరుపుతామన్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి పార్వతీ సమేత మల్లేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

శివరాత్రి సందర్భంగా 45 ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరు, మార్చి 6: మహాశివరాత్రి సందర్భంగా శుక్ర, శనివారాల్లో 45 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు పీలేరు డీఎం బండ్ల కుమార్ తెలిపారు. శుక్రవారం నాడు పీలేరు నుంచి తలకోనకు 20 బస్సులు, బోడేవాండ్లపల్లె నుంచి తలకోనకు 4, భాకరాపేట నుంచి తలకోనకు 4, బసన్నగారిపల్లె నుంచి తలకోనకు 3 బస్సులు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. శనివారం నాడు కలకడ నుంచి ఝరికోనకు 15 సర్వీసులు నడపనున్నట్లు ఆయన వివరించారు. భక్తులు తమ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

పెద్దమండ్యం, మార్చి 6: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పెద్దమండ్యం ఎంఈవో మనోహర్ తెలిపారు. పెద్దమండ్యం, కలిచెర్ల హైస్కూల్‌ల్లో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు జ్ఞాపికలను అందజేశారు. కలిచెర్ల సింగిల్ విండో ఛైర్మన్ కడప సుధాకరరెడ్డి, ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, పెద్దమండ్యం, కలిచెర్ల హెచ్ఎంలు అమీర్, రామచంద్ర, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌బాబుకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

మదనపల్లె టౌన్, మార్చి 6: మదనపల్లె సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సతీష్‌బాబుకు హైదరాబాద్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సొసైటీ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం అందజేసింది. ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌పై 25 ఏళ్లుగా పరిశోధనాత్మక వ్యాసాలు రాసిన సతీష్ బాబుకు ఈ పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ దీక్షితులు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి చక్రపాణి ఆయనకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిత్య కళాశాల ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, డైరెక్టర్ రామలింగారెడ్డి అభినందించారు.

19మందికి క్యాటరాక్ట్ సర్జరీలు

మదనపల్లె అర్బన్, మార్చి 6: లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లె అధ్యక్షుడు డాక్టర్ అప్పినపల్లె బాస్కరాచారి ఆధ్వర్యంలో బుధవారం 19 మందికి ఉచితంగా క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ కాలనీలోని లయన్స్ ఆస్పత్రిలో లయన్ డాక్టర్ నివేదిత కంటిలో శుక్లం ఉన్నవారికి ా ఆపరేషన్లు చేయడంతోపాటు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎం.ఏఎఫ్ పీఆర్వో లయన్ గౌతమ్‌రెడ్డి, జీఎస్టీ సభ్యుడు లయన్ మహేష్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ మేట్లకు శిక్షణ

రామసముద్రం, మార్చి 6: రామసముద్రం మండల పరిధిలోని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 96 మంది మేట్లకు బుధవారం స్థానిక ఉపాధి హామీ భవనంలో ఎంపీడీవో నారాయణస్వామి అధ్యక్షతన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో మేట్ల ప్రాముఖ్యత, విధులు, బాధ్యతలు, ఉపాధి యాప్‌లో పని వివరాల నమోదుపై అవగాహన, ఈ శ్రమ రిజిస్ట్రేషన్, ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన నమోదు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు ఏపీవో గౌరీశంకర్ తెలిపారు.


బేటీ బచావో- బేటీ పడావోపై అవగాహన

పెద్దతిప్పసముద్రం మార్చి 6: మండల కేంద్రమైన పీటీఎం సమీపంలోని కస్తూరిబా పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ అద్వర్యంలో "బేటీ బచావో- బేటీ పడావో" అనే కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయరాణి పాఠశాల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా బీసీ ఉపాధ్యక్షులుగా కుడుం రంజిత్‌కుమార్


పెద్దతిప్పసముద్రం మార్చి 6 : అన్నమయ్య జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడిగా బి.కొత్తకోటకు చెందిన కుడుం రంజిత్‌కుమార్‌ను నియమించినట్లు తంబళ్లపల్లె నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు బిక్కా మధుకర్‌యాదవ్ తెలిపారు. బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి రంజిత్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె బీసీ సంఘ అధ్యక్షుడు బిక్కా మధుకర్ యాదవ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శివానంద తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడు అరెస్ట్


నిందితుడిని చూపుతున్న పోలీసులు

కురబలకోట, మార్చి 6: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అధ్యాపకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించినట్లు ఎస్ఐ మల్లికార్జు నరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ముదివేడు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణం నక్కదిన్నెకు చెందిన నరసింహులు కుమా రుడు భాస్కర్(27) అంగళ్ళు సమీపంలోని జూనియర్ కళాశాల లో ఏడాదిగా పీఈటీగా పని చేస్తున్నాడు. ఓ విద్యార్థినితో అసభ్య కరంగా ప్రవర్తించడమే కాకుండా, ఆమెను బెదిరించి డబ్బు వసూలు చేశాడు. విద్యార్థిని ఫిర్యాదు చేయగా విచారించి పోక్సో చట్టం కింద నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

మద్యానికి డబ్బులివ్వలేదని... భార్య, అత్తపై దాడి


గాయపడ్డ అనూషా

మదనపల్లె టౌన్, మార్చి 6: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి తన భార్యపై దాడి చేసి చేతులు విరిచే శాడు అడ్డువచ్చిన అత్త మీద కూడా దాడి చేశాడు. మదనపల్లె మండలం వేంపల్లె గ్రామానికి చెందిన మదనమోహన్, అనూషకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిస అయిన మదన్ మోహన్ నిత్యం భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మద్యానికి డబ్బులివ్వాలని భార్యతో గొడవపడ్డాడు. ఆమె నిరాకరించడంతో పక్కనే వున్న కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె రెండు చేతులు, ఒక కాలు విరిగిపోగా, తలపై తీవ్ర గాయమైంది. దాడికి అడ్డు వచ్చిన అత్త రెడ్డెమ్మపై కూడా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అనూష పరిస్థితి విషమంగా వుండటంతో ఆమెను తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.